
ఉష్ణోగ్రత (అంచనా)

5-6-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	39	27
తెనాలి	39	29
నరసరావుపేట	39	26
బాపట్ల	39	29
రెంటచింతల	39	28
చీరాల	39	29



సాగర్‌లో నీటి నిల్వ

జల.. జలాశయాలు

- రుతుపవనాల విస్తరణతో వర్షాలు
- కృష్ణమ్మకు పోటెత్తుతున్న వరద ప్రవాహం
- ప్రాజెక్టుల్లో ఆశాజనకంగా నీటి నిల్వలు
- గత ఏడాది కంటే 80.02 టీఎంసీలు అధికం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రుతు పవనాలు విస్తరణతో కృష్ణానది పరివాహక ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయి. జలాశయాల్లో నీటి నిల్వలు ఆశాజనకంగా ఉన్నాయి. ఆల్మట్టి, తుంగభద్ర, జూరాల ప్రాజెక్టులకు వరద ప్రవాహం పోటెత్తుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా జూన్ ప్రారంభంలోనే జలాశయాలకు నీటి ప్రవాహం వస్తోంది. ఆల్మట్టి నుంచి శ్రీశైలం ఎగువ ప్రాజెక్టుల వరకు పూర్తిస్థాయి నీటి నిల్వ 271.83 టీఎంసీలు కాగా ప్రస్తుతం 107.55 నిల్వ ఉంది. ఆల్మట్టికి 17,760, తుంగభద్రకు 8,222, జూరాలకు 18,867, శ్రీశైలానికి 17,759, సాగర్‌కు 4,377 కూసెక్కుల వరద ప్రవాహం ఉంది. కృష్ణానది పరివాహక ప్రాంతంలో భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దీంతో ఈ నెలాఖరుకు ప్రాజెక్టుల్లోకి సమృద్ధిగా వరద నీరు వస్తుందని జలవనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత ఏడాది జూలై నెలాఖరు కల్లా శ్రీశైలం ఎగువ ప్రాజెక్టులు నిండాయి. అదే పరిస్థితులు ఈ ఏడాది నెలకొంటాయని జలవనరుల శాఖ అంచనా వేస్తోంది. మొత్తంమీద సాగర్ ఆయకట్టులో ఈ ఏడాది కూడా సాగుకు నీరు వస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

జలాశయాల్లో నీటి నిల్వల వివరాలు...

జలాశయం	పూర్తి స్థాయి నిల్వ	గతేడాది నిల్వ	ప్రస్తుత నిల్వ
ఆల్మట్టి	123.08	22.37	54.23
నారాయణపూర్	33.31	19.30	24.45
జూరాల	9.66	3.75	8.43
తుంగభద్ర	105.78	3.37	20.44
శ్రీశైలం	215.81	32.29	53.75
నాగార్జున సాగర్	312.05	122.69	134.75

రేపటి నుంచి మెగా డీఎస్సీ

- ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

బాపట్లరూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ నిర్వహణకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. శుక్రవారం నుంచి నిర్దేశించిన సబ్జెక్టుల వారీగా ఆన్‌లైన్‌లో కంప్యూటర్‌బేస్‌డ్ విధానంలో పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా రెండు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం తెలిపారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల, చీరాల సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజి కేంద్రాల్లో ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఈ నెల 30 వరకు విడతల వారీగా పరీక్షలు జరగనున్నాయి. ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో పాటు అభ్యర్థుల కోసం హెల్ప్‌లైన్ డెస్కులు, కేంద్రాల వద్ద డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేశారు. అభ్యర్థులు నిర్దేశించిన సమయాల్లో పరీక్షా కేంద్రాలకు రావాలని, ఒక్క నిమిషం ఆలస్యమైన కేంద్రాల్లోకి అనుమతించమని డీఈవో స్పష్టం చేశారు.

ఆర్టీఈ అడ్మిషన్లు.. 1,689

- విద్యా హక్కు చట్టంలో విద్యార్థుల ఎంపిక
- 7 కల్లా ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రవేశాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యా హక్కు చట్టాన్ని(ఆర్టీఈ) కఠినంగా అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. విద్యా హక్కు చట్టాన్ని వైసీపీ నిర్వీర్యం చేయగా కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించి అమలు చేస్తోంది. ఒకటో తరగతిలో చేరే పేదల నుంచి దరఖాస్తులను స్వీకరించి లాటరీ పద్ధతిలో విద్యార్థులను విద్యాశాఖ ఎంపిక చేసింది. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల పరిధిలో 1,689 విద్యార్థులు ఆయా పాఠశాలల్లో అడ్మిషన్లకు ఆమోదం తెలిపింది. ఎంపికలో అనాథ పిల్లలు, దివ్యాంగులు, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ, అగ్రకులాల్లో పేదలకు ప్రాధాన్యం ఇచ్చింది. గుంటూరు జిల్లాకు సంబంధించి 1,149, పల్నాడులో 298, బాపట్ల జిల్లాలో 242 విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యాశాఖ అధికారులు సమాచారం అందించారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థులు అడ్మిషన్లు ఈ నెల 7 తేదీ కల్లా పొందాలని సదరు అధికారులు సూచిస్తున్నారు. విద్యా హక్కు చట్టం అమలుకు శ్రీకారం చుట్టి పేదలకు కార్పొరేట్ విద్యను ఉచితంగా అందిస్తుండటంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చట్టం ప్రకారం 1 నుంచి 8వ తరగతి వరకు ఉచితంగా ఆయా విద్యా సంస్థల్లో విద్యను వారు కొనసాగించవచ్చు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజును చెల్లించనున్నది.

నేడు సూర్యలంకలో వనమహోత్సవం

బాపట్ల రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సూర్యలంక సముద్రతీరం జీడిమామిడితోటలో నగరవనంలో గురువారం ఉదయం వనమహోత్సవం జరగనున్నది. ఈ కార్యక్రమంలో భాగంగా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి మొక్కలు నాటనున్నారు. కలెక్టర్ వెంకటమురళి, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం నగర వనంలో ఏర్పాట్లను ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా, డీఈ కృష్ణారెడ్డిలు పరిశీలించారు. అటవీశాఖాధికారులకు పలు సూచనలు చేశారు.



వన మహోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో గ్లోరియా

యోగాంధ్రకు.. 6,31,435 మంది

- లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలి
- అధికారులకు కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలు



బాపట్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్రకు 6,31,435 మంది సభ్యులను నమోదు చేసేందుకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. యోగాంధ్ర పేర్లు నమోదు వేగవంతంపై కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా అధికారులు, ఎంపీడీవోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర లక్ష్యంలో 5,55,218 మంది సభ్యుల పేర్లను ఇప్పటి వరకు నమోదయ్యాయన్నారు. మిగిలిన సభ్యుల నమోదుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలాల వారీగా ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయడంలో వెనుకబడిన ఎంపీడీవోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్యాలను పూర్తి చేయకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. యోగాంధ్రలో నమోదు చేసిన సభ్యులను గురువులతో మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో యోగా శిక్షణకు మూడుప్రాంతాలను నిర్దేశించి వాటి వివరాలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంలో వివిధ పోటీలు నిర్వహించి వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేయాలన్నారు.

- ప్రతి గ్రామంలో నూరుశాతం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో చెత్తను డోర్ మిత్ర, క్లాప్ మిత్రలచే ఇళ్లకెళ్లి చెత్తను సేకరించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, డీఎల్‌డీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు.. చిక్కులు

- కొలిక్కిరాని తొలిదశ..
- రెండో విడత ప్రారంభం
- సాంకేతిక సమస్యలతో పనిచేయని రోవర్స్
- సరిపడా సిబ్బంది లేక నత్తనడకన రీ సర్వే
- ముంచుకొస్తున్న గడువు.. 30 శాతమే పూర్తి

ఐదేళ్ల వైసీపీ పాలన వేల సంఖ్యలో భూ సమస్య లను మిగిల్చగా.. వీటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సమ గ్ర రీసర్వే కు శ్రీకారం చుట్టింది. అయితే ఈ కార్యక్రమానికి రక రకాల చిక్కులు ప్రతిబంధకంగా మారాయి. పైగా తొలి విడత రీ సర్వే జరుగుతుండగా.. అది ఒక కొలిక్కి రాకుండానే రెండో విడత ప్రారంభించింది. రెండో విడతకు గడువు ఈ నెల 6న విధించింది. అయితే సాంకేతిక సమస్యలు, సిబ్బంది కొరత, అందుబాటులో లేని రైతులు తదితర చిక్కులతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో ఇప్పటికి 30 శాతం కూడా రీ సర్వే పూర్తి కాలేదు. తొలి దశ రీ సర్వేను పూర్తి చేయడానికి ఈ ఏడాది ఫిబ్రవరి తుది గడువుగా ప్రభుత్వం నిర్దేశించింది. కానీ అది కొలిక్కిరాక ముందే రెండో దశ ప్రారంభించడంతో మొత్తం ప్రక్రియే ప్రహసనాన్ని తలపించే రీతిలో సాగుతుంది.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

భూ సమస్యలను పరిష్కరించి, భూ యజమానులకు ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం పక్కా ప్ర ణాళికతో సమగ్ర రీసర్వేకు శ్రీకారం చుట్టింది. తొలి దశ లో మండలానికో గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని గతే డాది చివరిలో భూముల ప్రక్షాళనకు ప్రభుత్వం సమా యత్తమైంది. సమగ్ర రీ సర్వేకు క్షేత్రస్థాయిలో ఎదుర వుతున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో రీసర్వే ముందుకు మూడడుగులు.. వెనక్కి ఏడడు గులు అన్న చందాన తయారైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అరకొర సౌకర్యాలు కల్పించి రీ సర్వే ప్రక్రియను గడువులోగా పూర్తి చేయమనే ఆదేశాలు ప్రభుత్వం వైపు నుంచి (మిగతా 6వ పేజీలో)

మొదటి దశకు మరో వారం..

మొదటి విడతలో బాపట్ల జిల్లాలో 62,288 ఎకరాలకు సర్వే పూర్తి చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య దాదాపు 1.10 లక్షల ఎకరాలుగా ఉంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ ఇంకా 13ఏ నోటీసులు జారీ చేయడం వరకే వచ్చింది. కాగా తుది జాబితా ఆర్ వోఆర్ ప్రచురణకు మరో వారం రోజులు పట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.



వేమూరు: కుచ్చెళ్లపాడు గ్రామంలో రీ సర్వే చేస్తున్న సిబ్బంది (పాత చిత్రం)



ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకున్న ఉపాధ్యాయులు

వెబ్ ఆప్షన్స్.. వెతలు

ఒక్కొక్కరికి గంటన్నర సమయం

- స్కూల్ అసిస్టెంట్ల బదిలీల్లో ఎడతెగని సమస్యలు
- నేటితో ముగియనున్న గడువు.. సమయం పెంచాలని విజ్ఞప్తిలు

గుంటూరు విద్య జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల సమస్యలు రోజుకు జటిలం అవుతున్నాయి. తప్పనిసరిగా(కంపల్సరీ) బదిలీ కావాల్సిన వారు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకునేందుకు ఒక్కో ఉపాధ్యాయుడికి గంట నుంచి 1.30 గంటల వరకు సమయం పడుతున్నది. ఆయా సమస్యలపై ఇప్పటికే విజ్ఞప్తులు చేసినా పరిష్కారం కావడం లేదని ఉపాధ్యాయ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ వెబ్ ఆప్షన్స్‌కు గురువారంతో గడువు ముగియనున్నది. ఈ పరిస్థితుల్లో గడువు పెంచాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. పాయింట్స్ సమానమైనప్పుడు సీనియారిటీ ప్రకారం కాకుండా పుట్టిన తేదీ తీసుకోవడం జీవో 22కు విరుద్ధమంటున్నారు. ప్రిఫరెన్సియల్ కేటగిరిలో రిక్వెస్ట్ ట్రాన్స్ఫర్ పెట్టుకున్నవారి ప్లేస్ అరైజింగ్ ఉన్నచోట ఖాళీగా కనిపించడంలేదంటున్నారు. డీఈవో కార్యాలయం విడుదల చేసిన ఖాళీలకు వెబ్ ఆప్షన్స్‌కు ఆన్‌లైన్‌లో ఉన్న ఖాళీలతో వ్యత్యాసం ఉందని ఉపాధ్యాయ సంఘాలు వెల్లడిస్తున్నాయి.

నేడు ఎస్‌జీటీలకు సర్టిఫికెట్ల పరిశీలన

మున్సిపల్, కార్పొరేషన్, జడ్పీ, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేసే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతుల జాబితాను డీఈవోజీఎన్‌టీబ్లాగ్‌స్పాట్ అనే వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో రేణుక తెలిపారు. సంబంధిత సబ్జెక్టు, మీడియానికి సంబంధించి కార్పొరేషన్‌లో 162, మున్సిపాలిటీలో 40 పోస్టులు ఉన్నాయన్నారు. ఉద్యోగోన్నతుల అర్హతగల ఉపాధ్యాయులకు సర్టిఫికెట్ల పరిశీలన గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు గుంటూరు పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు రావాలని సూచించారు. ప్రభుత్వ యాజమాన్యంలో 50 పోస్టులు, జిల్లా పరిషత్ యాజమాన్యంలో 83 పోస్టులకు అర్హులైె సర్టిఫికెట్ల పరిశీలన మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ తదితరులు

నేడు రాజధానిలో వనమహోత్సవం

- హాజరుకానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

8


వెంటాడుతున్న.. ప్లాస్టిక్ భూతం

- చర్యలు తీసుకొంటున్నా వదలని ప్లాస్టిక్
- మానవ శరీరాల్లోకి చొచ్చుకొస్తున్న సూక్ష్మ ప్లాస్టిక్ పదార్థాలు
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

అమరావతి కేంద్రంగా.. క్వాంటం వ్యాలీ

- రాజధానిలో ఉపాధి అవకాశాలు కోకొల్లలు
- సీఆర్‌డీఏలో 50 ఎకరాల కేటాయింపునకు ఆమోదం

గుంటూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీని ప్రమోట్ చేసి హైదరాబాద్‌ని దేశంలోనే ముఖ్యమైన నగరంగా సీఎం చంద్రబాబు చేశారో అంతకుమించి అమరావతిని మార్చేందుకు ప్రణాళికని రూపొందించారు. ఇందులో భాగంగానే కంప్యూటింగ్‌లో అడ్వాన్స్ అయిన క్వాంటమ్ విధానాన్ని అమరావతిలో ప్రమోట్ చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం 50 ఎకరాల భూమిని ఏపీసీఆర్‌డీఏ (మిగతా 6వ పేజీలో)



క్వాంటం వ్యాలీ టెక్ పార్కు నమూన

ఆంధ్రజ్యోతి అక్షరమే అండగా.. అభివృద్ధి



గాయత్రీ నగర్‌లో రూ.45 లక్షలతో పూర్తయిన సీసీరోడ్డు



కొట్నాస బజార్‌లో జరుగుతున్న పనులు

వినుకొండలో ముమ్మరంగా పనులపై హర్షం

వినుకొండటౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి అక్షరమే అండగా-పరిష్కారమే అజెండాగా కార్యక్రమం ద్వారా పట్టణంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. జనవరి 28న చేపట్టిన కార్యక్రమంలో స్థానిక గాయత్రినగర్, కొట్నాసబజార్‌లో మాజీ సర్పంచి పఠాన్ ఖాసిమ్‌ఖాన్ వీధిలోని సమస్యలను ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీంతో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు 2025 మార్చి 25న సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాల్వ పనులకు శంకు స్థాపన చేశారు. మూడు నెలల్లో గాయత్రీనగర్‌లో సుమారు రూ.45లక్షల తో సీసీ రోడ్డు పనులు పూర్తి చేశారు. కోట్నాస బ జార్‌లో రూ.17 లక్షలతో సీసీ రోడ్డుతో పాటు, డ్రెయినేజీ కాల్వ ప నులు శరవేగం గా జరుగుతున్నాయి. గతంలో మురుగునీటితో రాకపోకలకు స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతుండేవారు. ఆంధ్రజ్యోతి చేప ట్టిన కార్యక్రమం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులతో మురుగు ముప్పు తప్పిందని ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రీ సర్వేకు.. చిక్కులు

(5వ పేజీ తరువాయి)

రావడాన్ని ఉద్యోగులు తప్పుబడుతున్నారు. సిబ్బంది కొరత మూడు జిల్లాల్లో ఉన్నప్పటికీ కొత్త జిల్లాలైన బాపట్ల, పల్నాడు జిల్లాలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. దీంతో రీ సర్వే ఆశించినంత వేగంగా సాగడం లేదు. హద్దులు నిర్ణయించడానికి ఉపయోగించే రోవర్స్‌లో దాదాపు సగం సాంకేతిక సమస్యలతో పనిచేయడం లేదు. రోవర్స్‌ను బాపట్ల జిల్లాకు 119 కేటాయిస్తే 68 మాత్రమే పనిచేస్తున్నాయి. సాంకేతిక సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఉద్యోగుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే పని చేయని రోవర్స్ సంఖ్య వంద వరకు ఉండొచ్చని తెలుస్తోంది. రీ సర్వేలో సర్వే విభాగంతో పాటు రెవెన్యూ సిబ్బంది కూడా పాల్గొనాలి. అయితే రెవెన్యూలో అన్ని విభాగాల్లో కలిపి మూడు జిల్లాల పరిధిలో 320 వరకు ఖాళీలు ఉన్నట్లు సమాచారం. రీ సర్వే కార్యాలయాల్లోనూ ఖాళీలుండడం గమనార్హం. గత ప్రభుత్వం తప్పిదాలపై గ్రామసభల్లో వచ్చిన అర్జీల సంఖ్య ఒక్క బాపట్ల జిల్లాలోనే 5,900 వరకు ఉండగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య 14,000కు పైనే ఉంది. వీటి పరిష్కారం యంత్రాంగానికి తలకు మించిన భారంగా మారడంతో రీ సర్వేలో వేగం మందగించింది. రెండో దశ రీ సర్వే అంకాన్ని పూర్తి చేయడానికి ఈ నెల 6న గడువుగా ప్రభుత్వం విధించింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితిని గమనిస్తే ఇప్పటి వరకు 30 శాతం కూడా రీ సర్వే పనులు పూర్తి కాలేదు. రెండో దశలో బాపట్ల జిల్లాలో 79,000 ఎకరాలకు ఇప్పటి వరకు కేవలం 26,000 ఎకరాల్లోనే పూర్తి చేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

అమరావతి కేంద్రంగా.. క్వాంటం వ్యాలీ

(5వ పేజీ తరువాయి)

కేటాయించగా దానిని బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదించారు. దీంతో త్వరలోనే క్వాంటం వ్యాలీ అమరావతిలో ఏర్పాటు కానుంది. క్వాంటం కంప్యూటింగ్ అనేది ఎంతో అడ్వాన్స్ టెక్నాలజీ. క్వాంటం కంప్యూటర్లు సంప్రదాయ కంప్యూటర్ల కంటే శక్తిమంతంగా గణన చేస్తాయి, కొత్త ఔషధాల అభివృద్ధి, నమూనా రూపొందించడంలో సహకరిస్తాయి. ప్రస్తుతం పరిశోధన, అభివృద్ధి దశలో ఉండగా భవిష్యత్తులో కీలకం కానుండటంతో దానిని అందిపుచ్చుకునేందుకు సీఎం చంద్రబాబు క్వాంటం వ్యాలీని అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అమరావతిలో ఏర్పాటు చేయబోయే క్వాంటం వ్యాలీ అడ్వాన్స్ రీసెర్చ్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీలపై ఐఐటీ మద్రాసు, టీసీఎస్, ఐబీఎంతో కలిసి పని చేస్తుంది. తద్వారా అంతర్జాతీయ స్థాయి పరిశోధకులను అనువైన వేదికగా అమరావతి నిలుస్తుంది. అలానే దేశ, విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షిస్తుంది. ఇప్పటికే క్వాంటం వ్యాలీకి సంబంధించిన డీపీఆర్‌ని రూపొందించి నివేదించారు. ఎల్అండ్‌టీ సంస్థ క్వాంటం వ్యాలీ టెక్ పార్కు అభివృద్ధి చేస్తుంది. ఈ నెలలో సదస్సుని అంతర్జాతీయ నిపుణులతో కలిసి నిర్వహించి అభివృద్ధి వ్యూహాత్మక ప్రణాళికలను సిద్ధం చేయనున్నారు.

నంబరు ప్లేట్‌లపై ప్రత్యేక దాడులు

ఎఫెక్ట్

గుంటూరు(తూర్పు), జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రిక, గుంటూరు జిల్లా సంచిక నందు ప్రచురించిన "ప్లేట్ ఫిరాయిస్తున్నారు..." అనే శీర్షికపై రవాణాశాఖ అధికారులు స్పందించారు. గుంటూరు నగరంలో పలు ప్రాంతాల్లో హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్‌లపై బుధవారం ప్రత్యేక దాడులు చేపట్టారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించారు. తనిఖీల్లో 573 వాహనాలపై కేసులు నమోదు చేసి రూ. 86,400 జరిమానాలు విధించినట్టు ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

సాగు నీటి వృథాను అరికట్టాలి

- తక్షణమే తూములకు షట్టర్లు ఏర్పాటు చేయాలి
- ఇరిగేషన్ శాఖ ఆస్తులను పరిరక్షించాలి
- నీటి సంఘాలు.. జలవనరుల శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి
- సాగర్ ప్రాజెక్టు కమిటీ సమావేశంలో తీర్మానాలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు

నరసరావుపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్‌లో సాగు నీటి వృథాను అరికట్టాలి. తక్షణమే అవసరమైన చోట తూములకు షట్టర్లు ఏర్పాటు చేయాలని కలెక్టరేట్‌లో బుధవారం ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు అధ్యక్షతన జరిగిన సాగర్ ప్రాజెక్టు కమిటీ సమావేశంలో కాలువలకు సంబంధించిన వివిధ సమస్యలపై సభ్యులు చర్చించారు. కాలువలకు షట్టర్లు లేని కారణంగా గత సీజన్‌లో పెద్దఎత్తున సాగు నీరు వృథా అయిన అంశాన్ని సభ్యులు ప్రస్తావించారు. కాలువల మరమ్మతుల పనులు త్వరతగతిన పూర్తి చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. కొన్ని చోట్ల పనులకు సంబంధించి అంచనా వ్యయం సరిపోవడంలేదని, వ్యయంను పెంచాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. అధికారులు, సాగునీటి సంఘాలు, సిబ్బంది సమన్వయంతో పని చేసి రైతులకు సాగు నీటి అంశంలో మెరుగైన సేవలు అందించాలన్నారు.

చాలా చోట్ల ఎన్ఎస్‌పీ ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రూ కోట్ల విలువైన ఆస్తులను పరిరక్షించేందుకు తక్షణ చర్యలు అధికారులు చేపట్టాలని కోరారు. లింగంగుంట్ల సర్కిల్ పరిధిలో కాలువల ఆధునీకరణ పనులు జరిగాయని, మిగతా ప్రాంతాల్లో కూడా కాలువల ఆధునీకరణ అవసరాన్ని తెలియజేశారు. చివరి భూములకు సక్రమంగా సాగునీరు అందించే దిశగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సాగునీటి విషయంలో తలెత్తె సమస్యలను వెనువెంటనే పరిష్కరించే దిశగా అధికారులు స్పందించాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పూర్తిస్థాయిలో పంటలకు నీరు అందించేందుకు నీటి సరఫరాపై ప్రణాళిక రూపొందించాలని అధికారులను కోరారు. సమావేశంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలువలను పాడుబెట్టిందని, కూటమి ప్రభుత్వం కాలువల మరమ్మతులకు రూ. కోట్లలో నిధులు కేటాయించిందని ప్రభుత్వంకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి మాట్లాడుతూ ప్రతి ఎకరాలకు సాగు నీరు అందించే లక్ష్యంలో సాగునీటి సంఘాలతో కలసి జలవన రుల శాఖ అధికారులు, సిబ్బంది పనిచేయాలని కోరారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కాలువల ఆధునీకకరణ చేపట్టాలని కోరారు. సమావేశంలో లింగంగుంట్ల సర్కిల్ ఎస్ఈ కృష్ణమోహన్, ఒంగోలు ఎస్ఈ వరలక్ష్మి, జలవనరుల శాఖ ఇంజనీర్లు, డీసీల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆదర్శ రాజకీయవేత్త రెడ్డమ్మ చౌదరి

● సుదీర్ఘ కాలం జీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా సేవలు ● నేడు శత జయంతి



రెడ్డమ్మ చౌదరి

తెనాలి అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత వ్యక్తిత్వం, ఆదర్శ రాజకీయం ఈ రెండిండికి పరస్పరం వ్యతిరేకం. మంచి మనసులు కలిగిన వారు రాజకీయాల్లో ఇమడటం కష్టమంటారు. అందుకు భిన్నంగా రాజకీయాల్లో ఉంటూ ప్రజా సేవ చేసి ఆదర్శంగా నిలిచి ప్రశంసలు అందుకున్న వారు అరుదుగా కనిపిస్తారు. ఈ కోవకు చెందిన వారుగా తెనాలికి చెందిన కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి. రాజకీయ నేతగా జీవిత కాలం నిబద్ధతతో పని చేసి రాజకీయాల నుంచి స్వచ్ఛందంగా వైదొలగారు. నిరుద్యోగులు, పేద విద్యార్థులు, క్రీడాకారులకు ఆర్థిక సాయం చేశారు. విద్యాసంస్థలు, ఆలయాలు, ప్రార్థనా మందిరాలకు తోడ్పాటు ఇచ్చారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో 1925 జూన్ 5న ధనిక రైతు కుటుంబంలో జన్మించారు. బ్రిటీష్ ప్రభుత్వంలో జ్యూరీగా పని చేసిన కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి మనువడే ఈయన. తాత పేరిటే నామకరణం చేశారు. తండ్రి వల్లభరావు 20 గ్రామాల ప్రజలకు తలలో నాలుకగా ఉండేవారు. ఆయన పెద్ద తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు తామ్రపత్ర గ్రహీత సూర్యనారాయణ. స్వరాజ్యం కోసం ఏడేళ్ల కారాగార జీవనం చేశారు. తాత, పెద్ద నాన్న స్ఫూర్తితో చిన్ననాటి నుంచే ఆదర్శ భావాలు మొగ్గ తొడిగాయి. ఎస్ఎల్‌సి తరువాత రాజకీయ రంగం వైపు అడుగులు వేసిన ఆయన 1962లో గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ అయ్యారు. రెండుసార్లు పదవిలో కొనసాగిన ఆయన రైతు సేవలో సంస్కరణలు ప్రవేశ పెట్టారు. రుణాలను చెక్కుల రూపంలో ఇచ్చే విధానాన్ని తెచ్చారు. పార్టీలకు అతీతంగా పని చేసి రైతుల మన్ననలు పొందారు. రాజకీయాల స్వరూపం మారడాన్ని గ్రహించి స్వచ్ఛందంగా తప్పుకున్నారు. జేఎంజే మహిళ కళాశాల స్థాపనకు కృషి చేయడమే కాకుండా భూరి విరాళం అందించారు. కామినేని ఈశ్వరరావు 1952లో ఒలింపిక్ పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక సాయం అందించారు. తెలుగు భాషపై మమకారం ఉన్న ఆయన మధురావిజయం గ్రంథాన్ని 600 ఏళ్ల తరువాత తెలుగులోకి అనువదింపజేశారు. ఆయన సతీమణి అన్నపూర్ణాదేవి ఎన్నో ఆలయాలకు ఆర్థిక సాయం చేశారు. 10 మంది సంతానం కలిగిన వారంతా ఉన్నత విద్యావంతులే. 2005లో రెడ్డమ్మ చౌదరి, 2011లో అన్నపూర్ణాదేవి పరమపదించారు. వారి ఇద్దరి పేర్లతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి కుమారుడు రామరాయ చౌదరి సేవ చేస్తున్నారు.

ఎన్నారై ముసుగులో అక్రమాలు

● రూ. కోట్లలో అప్పు ఎగవేత ● రావి మురళిపై ఐటీడీపీ అధ్యక్షుడు పిల్లి కోటి ఆరోపణ

చిలకలూరిపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలో సాయి కార్తీక్ కాంప్లెక్స్ అనే పేరుతో రావి మురళి అనే ఎన్నారై, ఆయన కుటుంబ సభ్యులు అనేక అక్రమాలకు పాల్పడ్డారని చిలకలూరిపేట నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు పిల్లి కోటి బుధవారం ఆరోపించారు. టీడీపీ సానుభూతిపరులైన అమాయక ప్రజలు, రైతుల వద్ద నుంచి కోట్ల రూపాయలు అప్పులు తీసుకుని తిరిగి ఇవ్వకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారని చెప్పారు. బ్యాంకు రుణ వాయిదాల చెల్లింపునకు అవసరమని 17 మంది వద్ద నుంచి సుమారు రూ. 8 కోట్లు అప్పుతీసుకున్నారని తెలిపారు. తమ కుమారుడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడని, మాయమాటలు చెప్పి కుటుంబ సభ్యులు అప్పు తీసుకుని కాంప్లెక్ నిర్మాణంతో పాటు కొన్ని చోట్ల స్థలాలు కొనుగోలు చేశారని వివరించారు. అప్పు ఇచ్చిన వారిని, ఎమ్మెల్యే పుల్లారావును అసభ్యంగా తిడుతూ సామాజిక మాధ్యమాలలో ఎన్నారై మురళి పోస్టింగులు పెట్టారని అన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు ఎటువంటి సంబంధంలేదని వివరించారు. ఎన్నారై మురళి పెట్టిన పోస్టింగులను అనేకమంది ఎన్నారైలు ఖండించిన విషయం చాలామందికి తెలుసునని అన్నారు. న్యాయం కోసం కాంప్లెక్స్ ఎదుట బాధితులు మౌన పోరాటం చేస్తే దానిని కూడా వక్రీకరించారని అన్నారు. ఎన్నారై రావి మురళి ఎక్కడో హైదరాబాదులో కూర్చొని బలవంతంగా అమ్మానాన్నలని బెదిరించి ప్రెస్ మీ ట్‌లో కూర్చోబెట్టి మాట్లాడటం కాదు, మీకు అప్పిచ్చి మోసపోయిన బాధితులకు న్యాయం చేసి మీ వ్యాపారాలు చేసుకోవచ్చు కదా అని ప్రశ్నించారు. సానుభూతి కోసం వారి ఆస్తులను కబ్జా చేశారని అసత్య ఆరోపణలు చేశారని అన్నారు. ఆ అవసరం బాధితులకు ఎప్పుడూ లేదని, అప్పు తీసుకున్న మొత్తాలు తిరిగి చెల్లిస్తే చాలని చెప్పారు. ఎన్నారై మురళి వ్యవహారాన్ని రాష్ట్ర మంత్రి లోకేశ్, పోలీసుల దృష్టికి బాధితులు చాలా కాలం క్రిందటే తీసుకెళ్లారని తెలిపారు.

రొంపిచర్లలో హైవేపై రోడ్డు ప్రమాదం.. ఒకరు మృతి

రొంపిచర్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రొంపిచర్ల విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగి ఒకరు మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ నుంచి కందుకూరు వెళ్తున్న ఆర్టీసీ సర్వీసు రొంపిచర్ల సమీపంలో హైవే పై ప్రయాణికులను దించటానికి ఆగింది. 22 మంది ప్రయాణికులతో ఈ బస్సు కందుకూరు వెళ్తుంది. రొంపిచర్లలో పలువురు దిగిన తరువాత వెనుక నుంచి వస్తున్న కంటైనర్ లారీ ఈ బస్సును ఢీకుంది. దీంతో బస్సు పక్కకు నిలిపి వేశారు. బస్సు కదలక పోవటంతో అందులోని ప్రయాణికులను అదే డిపోకు చెందిన మరో బస్సులోకి ఎక్కించటానికి ఆర్టీసీ సర్వీసును ఆపారు. ఇంతలో కంటైనర్‌ను వెనుకగా వస్తున్న చెన్నై వెళ్ళే ట్రావెల్ బస్సు ఢీకొంది. దీంతో కంటైనర్ ముందుకు వెళ్ళి అక్కడ బస్సు ఎక్కుతున్న ప్రయాణికుల్లో ఒకరిని ఢీకుంది. బెల్లంకొండ మాధవరావు(40) అక్కడికక్కడే మృతి చెందాడు. టంగుటూరు సమీపంలోని గుడ్లూరు మండలం మిట్టపాలెంకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. కుటుంబంతో సహా మాధవ రావు హైదరాబాద్‌లోని బాలానగర్ మండలం బోరబండలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పనుల నిమిత్తం సొంతూరు వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ఆర్టీసీ సర్వీసు వెనుక భాగం, కంటైనర్ ముందు భాగం, ట్రావెల్ బస్సు ముందు భాగం దెబ్బతిన్నాయి. ట్రావెల్ బస్సులో 12 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు ప్రమాదంలో అధిక మంది ప్రయాణికులు తృటిలో తప్పించుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరా వుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మణికృష్ణ తెలిపారు. సంఘటనా స్థలాన్ని రూరల్ సీఐ రామకృష్ణ పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన బస్సులు, కంటైనర్‌నుస్టేషన్‌కు తరలించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 511.80 అడుగులు ఉంది. ఇది 134.74 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 4050 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ 450 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 4500 క్యూసెక్కుల నీరు దిగువకు చేస్తున్నారు.

జీడీసీసీ చైర్మన్‌గా మక్కెన నేడు ప్రమాణ స్వీకారం

వినుకొండ, జూన్ 4, (ఆంధ్రజ్యోతి) మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు గురువారం గుంటూరులోని బ్రాడీపేట నందు గల జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ కార్యాలయం ఆవరణలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాజుపాలెం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారిపై నెమలి పురి గ్రామ సమీపంలో జరిగింది. పోలీసుల వివరాలిలా ఉన్నాయి. బుధవారం నెమలి పురి గ్రామానికి చెందిన కంకణంపాటి నరసయ్య(55) కొండమోడు నుంచి మోటర్ సైకిల్‌పై నెమలిపురి వస్తున్నాడు. అదే సమ యంలో హైదరాబాద్ నుంచి ఒంగోలు వెళ్తున్న కారు అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. ఈ సంఘటనలో నరసయ్య అక్కక్కడే మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ వేణుగోపాల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పౌర్ణమికి అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు

గుంటూరు, జూన్ 4: ఈనెల 11న పౌర్ణమి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షణకు భక్తుల కోసం ఆర్టీసీ స్పెషల్ హైటెక్ 2+2 పుష్ బ్యాక్ ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించినట్లు గుంటూరు-2 డిపో ఇన్‌చార్జి మేనేజర్ పిచ్చయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ నుంచి 9 తేదీ రాత్రి 9.15 గంటలకు బయల్దేరి 10వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడే బస చేసి 11న పౌర్ణమి రోజున అరుణాచలానికి చేరుకుంటుందన్నారు. అదే రోజున అరుణాచలేశ్వరుని దర్శించుకుని సాయంత్రం బయల్దేరి 12వ తేదీన ఉదయం 6.30 గంటలకు గుంటూరు బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. 96164 సర్వీసుకు ఆన్‌లైన్ ద్వారా రిజర్వేషన్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఒక్కో టిక్కెట్ చార్జి రూ. 2,420 మాత్రమేనని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం 7382897459, 7382894613 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఆర్‌టీఈ ప్రవేశాలను అడ్డుకుంటే గుర్తింపు రద్దు చేయాలి



డీఈవో రేణుకకు వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు జిలాని తదితరులు

గుంటూరు (విద్య) జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో విద్యకు చట్టం ద్వారా వచ్చిన ప్రవేశాలను అడ్డుకునే పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని ఏపీ సిటిజన్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ జిలాని విజ్ఞప్తి చేశారు ఈ మేరకు బుధవారం డీఈ ఓ సీవీ రేణుకకు వినతిపత్రం అందజేశారు. అనేక ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు ఆర్టీఈ ప్రవేశాలను అడ్డుకుంటున్నాయని, ప్రవేశాల కోసం విద్యార్థులతో వచ్చిన తల్లిదండ్రులను చులకన చేసి మాట్లాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు దాదా కరీం, సత్య, సందీప్ బాలకృష్ణ పాల్గొన్నారు

సీఎంను కలిసిన యూపీఎస్సీ ర్యాంకర్ పవన్ కల్యాణ్



సీఎం చంద్రబాబు నాయుడును కలిసిన యూపీఎస్సీ ర్యాంకర్ చల్లా పవన్ కల్యాణ్, చిత్రంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, చల్లా రమేష్ తదితరులు

గుంటూరు సిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఈ మధ్య వెల్లడి అయిన యూపీఎస్సీ ఫలితాల్లో 146వ ర్యాంకు సాధించిన చల్లా పవన్ కల్యాణ్ బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిశారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అచ్చంపేట మండలం రుద్రవరం గ్రామానికి చెందిన యూపీఎస్సీ ర్యాంకర్ పవన్ కల్యాణ్‌ను సీఎం వద్దకు ప్రత్యేకంగా తీసుకువెళ్లారు. కఠోర శ్రమతో పవన్ కల్యాణ్‌ను ఉన్నత స్థానంలో ఉండేలా ప్రోత్సహించిన తల్లిదండ్రులు చల్లా రమేష్, భువనేశ్వరిని సీఎం ఈ సందర్భంగా అభినందించారు.

సొంతవారిని వెన్నుపోటు పొడిచింది జగనే

● రాక్షసపాలన అంతమై ఏడాది ● మంత్రి అనగాని



యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని మంత్రి అనగానికి అందిస్తున్న మంత్రి నారా లోకేశ్

రేపల్లె, జూన్ 4(ఆంధ్రజ్యోతి): నాటిరాక్షసపాలనపై ప్రజలను చైతన్యవంతం చెయ్యటంలో యువగళం పాదయాత్ర సఫలీకృతమయిందని, రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్య ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలో యువగళం పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని మంత్రి అనగానికి మంత్రి లోకేశ్ అందించారు. ఈ సందర్భంగా అనగాని మాట్లాడుతూ ఆనాటి అనుభవాలను కళ్ళకు కట్టినట్లుగా పుస్తక రూపంలో తీసుకురావటాన్ని ఆయన ప్రశంసించారు. ఈరోజుకు అరాచక పాలన అంతమై ఏడాది పూర్తయ్యిందని గత ప్రభుత్వ పాలన పీడకలను ఇప్పటికి జనం మరిచిపోలేరన్నారు. ప్రజల్లో ఉనికి కోల్పోతున్నామని జగన్‌రెడ్డి కుటిల రాజకీయాలకోసం వెన్నుపోటు దినోత్సవం అంటూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. సొంత చెల్లికి, తల్లికి వెన్నుపోటు పొడిచిన జగన్‌రెడ్డి చేసిన వెన్నుపోట్లు ఎన్నో ఉన్నాయన్నారు. గుండెపోటు అంటూ బాబాయ్‌ను గొడ్డలిపోటుకు గురిచేసి చిన్నాన్ననే వెన్నుపోటుపొడిచిన మనస్తత్వం జగన్‌దేనన్నారు.

రాష్ట్ర చరిత్రలో చిరస్థాయిగా జూన్ 4

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చరిత్రలోనే 2024 జూన్ 4వ తేదీ ప్రజలు పోరాట దినంగా, సుపరిపాలన సంవత్సరంగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది క్రితం సరిగ్గా ఇదేరో జు వైసీపీ అవినీతి, అరాచకపాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా నిలిచి కూటమికి ఘన విజయం అందించారని హర్షం వ్యక్తం చేశారు. మొత్తం 175 స్థానాలకు 164 అసెంబ్లీ, 25కి 21 పార్లమెంట్ సీట్లలో కూటమిని గెలిపించిన తీరు తమపై ప్రజలు నమ్మకానికి ప్రతి రూపంగా పేర్కొన్నారు. నాడు ప్రజలు ఇచ్చిన తీర్పు బలంతోనే సుపరిపాలన, సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కష్టపడుతున్నారన్నారు. ఇలాంటి రోజును వైసీపీ వెన్నుపోటు దినంగా పాటించడం వారి దివాలా కోరుతనం, నీచత్వానికి నిదర్శమని మండిపడ్డారు. ప్రజల ఆకాంక్షల మేరకే తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కట్టుబడి పనిచేస్తున్నాయన్నారు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి, ఇసుక మాఫియా, మద్యం మాఫియా, భూకబ్జాలతో ప్రజలను దోచుకున్నారన్నారు. ఈ ఏడాది సాధించిన విజయాలు కేవలం ఆరంభం మాత్రమేనని, ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలపడానికి కూటమి ప్రభుత్వం కృషి కొనసాగుతూనే ఉంటుందన్నారు.

ఏపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా లింగంశెట్టి

● కమిటీలో మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలికి చోటు



లింగంశెట్టి ఈశ్వరరావు

గుంటూరు, జూన్4(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే, సీనియర్ కాంగ్రెస్ నేత లింగంశెట్టి ఈశ్వరరావు మరోసారి నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియామకపు ఉత్తర్వులు విడుదల చేశారు. 1978లో కాంగ్రెస్ అభ్యర్థిగా గుంటూరు -1 ఎమ్మెల్యేగా ఎన్నికైన ఈశ్వరరావు అనంతరం ఏపీసీసీలో, ఏఐసీసీలో పలు పదవులు నిర్వహించారు. కమిటీలో మరో ఆరుగురు నేతలకు చోటు కల్పించారు. ఇందులో జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, మేరాజోతు సూర్యానాయక్‌లు ఉన్నారు. గతంలో ఏపీసీసీ అధ్యక్షుడిగా రఘువీరారెడ్డి వ్యవహరించిన సమయంలోనూ క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా లింగంశెట్టి వ్యవహరించారు. ఈ సందర్భంగా లింగంశెట్టి మాట్లాడుతూ తనను క్రమశిక్షణా కమిటీ చైర్మన్‌గా నియమించినందుకు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్యంఠాగూర్, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ పాలక్‌వర్మలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు నరసరావుపేటలో 10వేల మందితో యోగాంధ్ర

నరసరావుపేట కల్చరల్, జూన్,4(ఆంధ్రజ్యోతి) యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టరేట్ పరేడ్ గ్రౌండ్స్ నందు 10 వేల మందితో సామూహిక యోగా కార్యక్రమం నిర్వహస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు బుధవారం తెలిపారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొంటారని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమానికి రాష్ట్రస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారాన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెరేడ్ గ్రౌండ్స్ నందు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రతి మండలం, మున్సిపాలిటీలలో మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ కార్యకర్తల దాడి

వినుకొండటౌన్, జూన్ 4, (ఆంధ్రజ్యోతి) వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న టీడీపీ కార్యకర్తపై వైసీపీకి చెందిన ఇద్దరు దాడిచేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధితుడి బంధువులు తెలిపిన వివరాలు.. బొల్లాపల్లి మండలం పలుకూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సంపతి కోటేశ్వరరావుపై అదే గ్రామం వైసీపీకి చెందిన బొడ్డు వెంకటేశ్వర్లు, బొడ్డు సత్యంలు మంగళవారం రాత్రి దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని తెలిపారు. సమాచారం తెలుసుకున్న బొల్లాపల్లి ఎస్ఐ బాలకృష్ణ గ్రామానికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి, గాయపడిన కోటేశ్వరరావును చికిత్స కోసం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వినుకొండలో చికిత్స పొందుతున్న బాధితునిపై బొల్లాపల్లి మండలం పలుకూరు గ్రామం నుంచి బుధవారం వినుకొండలో జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమానికి వచ్చిన బొడ్డు గోవిందు, బత్తుల చిన్న గోవిందయ్య చికిత్స పొందుతున్న సంపతి కోటేశ్వరరావుపై దాడి చేయడం జరిగింది. వైద్యశాలలోని సీసీ పుటేజ్ పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

పెన్‌కాక్ సిలాట్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం

● కానిస్టేబుల్‌ను అభినందించిన ఎస్పీ తుషార్ డూడి



కానిస్టేబుల్ వీరంకి నరేంద్రను అభినందిస్తున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి 13వ పెన్‌కాక్ సిలాట్ ఛాంపియన్‌షిప్ 2025లో కానిస్టేబుల్ వీరంకి నరేంద్ర అత్యుత్తమ ప్రతిభను కనబరిచి రజత పతకం సాధించాడు. ఇప్పటికే రెండుసార్లు జాతీయ స్థాయి మెడల్స్ సాధించిన కానిస్టేబుల్ నరేంద్ర మరొకసారి రజతపతకం సాధించటంపై ఎస్పీ తుషార్‌డూడి అభినందనలు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఆయనను అభినందించారు. కర్లపాలెం పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వీరంకి నరేంద్ర ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నో నగరంలోని కెడిసింగ్‌బాబు స్టేడియంలో జరిగిన ఛాంపియన్‌షిప్ పోటీలలో ఈపతకం సాధించినట్లు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ 2018లో కాంస్యపతకం, 2024లో కాంస్యపతకం సాధించిన నరేంద్ర భవిష్యత్తులో మరెన్నో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది క్రీడలలో రాణించాలని తద్వారా శారీరక, మానసిక ధృడత్వాన్ని పెంపొందించుకోవాలని ఎస్పీ సూచించారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన వారిని ప్రోత్సహిస్తామని ఎస్పీ తెలిపారు.

ఆరుద్ర, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు ఘన నివాళి



కవి ఆరుద్ర, సినీగాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సాహితీభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ, కోశాధికారి ఆదంషఫి తదితరులు

బాపట్ల,జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : తెలుగు అభ్యుదయ సాహితీరంగ స్ఫూర్తిప్రదాత, తెలుగు భాష మీద అనన్య సామాన్య పరిశోధన చేసి 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' అనే పన్నెండు భాగాల అద్భుత రచన ఆరుద్ర చేశారని, దాదాపు 16 భాషలలో 50 వేల పాటలు పాడి ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులను అలరించిన గాన గాంధర్వ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని సాహితి భారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. అభ్యుదయ కవి ఆరుద్ర 27వ వర్ధంతి, గాన గంధర్వ ఎస్పి బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతి కార్యక్రమాలలో బుధవారం సాహితి భారతి కోశాధికారి ఆదంషఫి, వైద్యవిదాన్ డాక్టర్ శ్రీనివాస్‌లు సంయుక్తంగా మాట్లాడారు. అనంతరం సాహితిభారతి సభ్యులు దగ్గుమల్లి శామ్యూల్, ఎం.మాల్యాద్రిరావు, కాళీదాసు కామరాజు, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి తదితరులు ఆరుద్ర, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

6న కల్యాణ మండపం పునర్నిర్మాణం

● పురాణ కాలక్షేప భవన నిర్మాణ ప్రారంభోత్సవం



చందోలు గ్రామంలో ఉన్న శ్రీ లింగోద్భవస్వామి

పిట్టలవానిపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీలింగోద్భవస్వామి దేవస్థానంలో ఈ నెల 6వ తేదీ ఉదయం 7.30 నిమిషాలకు శ్రీ స్వామి వారి కల్యాణ మండప పునర్నిర్మాణ శంకుస్థాపన మహోత్సవం, ఆలయ తూర్పు భాగంలో నూతనంగా నిర్మించిన పురాణ కాలక్షేప భవన నిర్మాణ ప్రారంభోత్సవం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో జరుగుతుందని త్రిముఖ దేవాలయాల కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. అదేరోజు ఉదయం 10 గంటల నుంచి శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందని, ఉదయం 11.30కి వేద ఆశీర్వచనాలు, మధ్యాహ్నం 12 గంటలు నుండి భక్తులకు అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. అన్నదాన కార్యక్రమాలను ఉభయదాతలుగా ఒంగోలుకు చెందిన తెల్లపాటి శ్రీనివాసరావు, కనకదుర్గ దంపతులు, చందోలు గ్రామానికి చెందిన యేండూరి సాయి గుప్తా, కామేశ్వరి దంపతులు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. విజయవాడకు చెందిన వేగా జ్యూయలర్స్ ఎండీ వనమా నవీన్‌కుమార్, శైలజ దంపతులు స్వామివారి కల్యాణ మండప శంకుస్థాపనలో పాల్గొంటారని తెలిపారు.

రౌడీషీటర్ల కుటుంబాలకు జగన్ పరామర్శ సిగ్గుచేటు : కొల్లా

బాపట్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జగన్ ప్రభుత్వంలోనే రౌడీషీటర్‌లుగా పోలీసు రికార్డులో ఉండి చంద్రబాబు ప్రభుత్వంలో కూడా రౌడీయిజం చేస్తూ శాంతిభద్రతలను కాపాడే పోలీసు కానిస్టేబుల్‌పై దాడి చేసిన రౌడీల కుటుంబాలను పరామర్శించి ఆ కుటుంబాలు అమాయకులని సానుభూతి తెలపటం సిగ్గుచేటు అని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గంజాయి, మద్యం మత్తులో చెలరేగి హింసాయుత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి అండగా నిలబడటానికి తెనాలి వచ్చి ఏ మెసేజి ఇస్తున్నారని దళిత సంఘాలు నిలదీస్తూ కాన్వాయ్ మీదకు దూసుకెళ్ళటం గమనార్హమన్నారు. రౌడీషీటర్ల పరామర్శ జగన్ నేరప్రవృత్తికి, వైసీపీ నీచరాజకీయాలకు నిదర్శనమని కొల్లా పేర్కొన్నారు.

ప్రజలకు అన్యాయం చేసిన కూటమి నాయకులు

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో ప్రజలకు మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి నాయకులు తీరని అన్యాయం చేశారని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. బాపట్ల రథం బజారులోని వైసీపీ కార్యాలయం దగ్గర నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చినపోతుల హరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఏడుకొండలురెడ్డి, కర్లపాలెం మండల పార్టీ అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ పిన్నిబోయన ప్రసాద్, జిల్లా యువజన అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ షేక్ సలీమాకు వినతిపత్రం అందజేశారు.



ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి తదితరులు

రేపల్లెలో ర్యాలీ..

రేపల్లె, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అవినీతి, అరాచకపాలన కొనసాగుతుందని రేపల్లె వైసీపీ ఇన్‌చార్జ్ ఈవూరి గణేష్ అన్నారు. వైసీపీ రాష్ట్రపార్టీ పిలుపు మేరకు బుధవారం పట్టణంలో వెన్నుపోటు దినం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పార్లమెంటరీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ తోమాటి మాధవరావు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నిరసనను అడ్డుకున్న పోలీసులు

కొల్లూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు మండల పరిధిలోని మొసలిపాడు వద్ద నుంచి కార్యకర్తలతో ర్యాలీగా కొల్లూరులోని రెవెన్యూ కార్యాలయానికి వచ్చేందుకు సిద్ధమయ్యారు. రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు తమ సిబ్బందితో వారిని అడ్డుకుని కొల్లూరులోనే నిరసన ప్రదర్శన అనుమతులు పొందారని మొసలిపాడు నుంచి ర్యాలీ, వాహనాలకు అనుమతులు పొందలేదని అడ్డుకోవడంతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పోలీసులను నెట్టుకుంటూ ప్రధాన రహదారి వరకు చేరుకున్నారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లును డీఎస్పీ మొసలిపాడు పిలిపించి అక్కడే వినతి పత్రం ఇప్పించడంతో నిరసనకు తెరపడింది. కార్యక్రమంలో వైసీపీ నాయకుడు కోగంటి లవకుమార్, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు, బెల్లంకొండ శివపార్వతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

దత్తత ప్రక్రియ చట్టబద్ధంగా జరగాలి

● బాలల సంక్షేమ కమిటీ సమావేశంలో కలెక్టర్ వెంకటమురళి



బాలల సంక్షేమ జిల్లా కమిటీతో సమావేశమైన కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : అనాధ శిశువుల దత్తత ప్రక్రియ చట్టబద్ధంగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బాలల సంక్షేమ కమిటీ సమావేశం బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ చెత్తకుండీల వద్ద, ఆసుపత్రులు, ఆర్టీసి బస్టాండ్‌ల వద్ద వదిలేసిన శిశువులు, మహిళా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడిచే శిశుగృహ, బాలసదన్‌లలో ఆశ్రయం పొందుతున్నారని చెప్పారు. అలాంటి శిశువులు, బాలలు 7గురు ప్రభుత్వ సంరక్షణలోని శిశు గృహాలలో ఉన్నారని కలెక్టర్ తెలిపారు. బాపట్ల జిల్లా ఏర్పడిన తర్వాత శిశుగృహాలకు వచ్చిన వారందరికి తల్లిదండ్రుల ప్రేమ అందించాలన్నారు.

మొదటిసారిగా బాపట్ల జిల్లా నుంచి దత్తతు ఇవ్వటానికి అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఛైల్డ్‌సెంట్రల్ అడాప్షన్ రీసోర్స్ అథారిటీ ద్వారా ఈ ప్రక్రియ జరుగుతుందన్నారు. చట్టప్రకారం దత్తతు ప్రక్రియతోనే తల్లిదండ్రులను వారికి జత చేయగలమన్నారు. ప్రస్తుతం ఇరువురిని దత్తతు ఇవ్వటానికి జిల్లా స్థాయి కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. నిబంధనలు అనుసరించి బాలిక లావణ్య, బాలు, కార్తీక్‌లకు సంబంధించిన ధ్రువీకరణపత్రాలు జారీ చేయాలని ఎస్పీ తుషార్ డూడికి ఫోన్ ద్వారా కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఇందుకు సంబంధించిన విచారణ నివేదికను వేగంగా పంపాలని చెప్పారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లాఅధికారిణి రాధా మాధవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, జువెనైల్ వెల్ఫేర్ కమిటీ ప్రొబిషన్ అధికారి సౌందర్య, డీసీపీవో పురుషోత్తమరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి తదితరులు

యోగాతో మానసిక ఉల్లాసం : కమిషనర్

బాపట్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : యోగా చేయటం ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక ధారుడ్యం బలపడుతుందని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. పురపాలక సంఘ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి కమిషనర్ యోగాసనాలు చేశారు. నిత్య జీవితంలో ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపటానికి అందరూ తప్పక యోగా పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో అబ్దుల్ జబ్బార్, గురజాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలలో అష్రఫ్ ఉద్దీన్‌కు గోల్డ్‌మెడల్

బాపట్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో షేక్ అష్రఫ్ ఉద్దీన్ గోల్డ్‌మెడల్ సాధించాడు. ఒంగోలులో జరిగిన 12వ రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలలో బాపట్లకు చెందిన షేక్ అష్రఫ్ ఉద్దీన్ జూనియర్ విభాగంలో పాల్గొని బంగారుపతకం సాధించారు. ఈసందర్భంగా మాజీ సైనిక సంక్షేమ సంఘం బాపట్ల అధ్యక్షుడు పుట్టా ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గోల్డ్‌మెడల్ సాధించటం మాజీ సైనికులందరికి గర్వకారణమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు షేక్ మొహిద్దీన్, పువ్వాడ యలమంద, పీటా సారథి, సుంకర శేషగిరిరావు, తోట దుర్గారావు, షేక్ నిజాముద్దీన్, డి.వెంకటేశ్వర్లు, అడే కిషోర్, అడే రాఘవదేవి తదితరులు పాల్గొన్నారు.



అష్రఫ్‌ఉద్దీన్‌ను అభినందిస్తున్న మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు తదితరులు

ఉమెన్ బీచ్ కబడ్డీటీమ్‌కు క్రీడాదుస్తులు పంపిణీ

బాపట్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 33వ వార్డులో బాపట్ల కబడ్డీ క్లబ్ ఆధ్వర్యంలో 12వ నేషనల్ బీచ్ కబడ్డీ క్యాంప్ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఉమెన్ బీచ్ కబడ్డీ టీమ్‌కు టీడీపీ నాయకులు యలవల వెంకటేశ్వరరావు క్రీడాదుస్తులు అందజేశారు. ఈనెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మచిలీపట్నంలో జరిగే కబడ్డీ పోటీలలో ఆంధ్రప్రదేశ్ తరుపున ప్రాతినిధ్యం వహించే ఉమెన్ బీచ్‌కబడ్డీ టీమ్ విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హైస్కూల్ పీడీ కత్తి శ్రీనివాసరావు, తిరుమలశెట్టి సాంబశివరావు, పూలా నాగులు, సంగీతప్రసాద్, ఎం.నాగేశ్వరరావు, ఎం.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



కబడ్డీ ఉమెన్ జట్టుకు క్రీడా దుస్తులు అందజేసి వారితో నిర్వాహకులు

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులపై తనిఖీ

కర్లపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జరిగిన పనులపై సామాజిక బృందం వారు తనిఖీ నిర్వహిస్తారని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024-2025 ఆర్థిక సంవత్సరానికి జరిగిన పనులపై సామాజిక తనిఖీ 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు కర్లపాలెం మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో సామాజిక బృందం వారు తనిఖీ నిర్వహిస్తారని తెలిపారు. 17న మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో మండల సామాజిక తనిఖీ వేదిక జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో కె.శ్యామ్, ఎస్ఆర్పీ తులసినాయక్, ఏఈసీ రమేష్, ఏవో రజిని, జీఆర్పీలు, పంచాయతీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తదితరులు

వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దే రేషన్

కర్లపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం పంచాయతీ ఎం.వి.రాజుపాలెం 13వ నెంబరు రేషన్ షాపు డీలర్ సయ్యద్ షాహిదా తన పరిధిలోని వృద్ధులకు, దివ్యాంగులకు బుధవారం ఇంటి వద్దకు తీసుకెళ్ళి రేషన్ సరుకులు అందజేశారు.

ఆవులను, దూడలను వధించరాదు : డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జి.రామాంజనేయులు, కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఏ మతం వారు ఆవులను, దూడలను వధించరాదని డీఎస్పీ జి.రామాంజనేయులు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. ఈ విషయమై బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయానికి పనికిరాని జంతువులను మాత్రమే వెటర్నరీ వైద్యుల ధ్రువీకరణపత్రం పొంది అధికారులు తెలిపిన ప్రాంతాలలోనే వధించుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మొక్కలను నాటుతున్న బాపట్ల ఎంపీడీవో బి.బాబురావు

అడవిపంచాయతీ వద్ద స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

బాపట్ల రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం అడవి పంచాయతీ, స్టూవర్టుపురం గ్రామాలలో బుధవారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని బుధవారం బాపట్ల ఎంపీడీవో బి.బాబురావు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల వద్ద మొక్కలను నాటారు. వర్మి కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాలలో నిర్వహించిన గ్రామసభలలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తడి, పొడి చెత్తను విడివిడిగా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. వీధులలో ఇరువైపుల చెత్త వేయరాదని ప్రజలకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయసారధి పాల్గొన్నారు.

మట్టి నమూనాలు పరీక్షించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి సునీత

వేమూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సిహెచ్ సునీత తెలిపారు. సాగుకు సమాయత్తం కార్యక్రమంలో భాగంగా బుధవారం జంపని గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతులు భూసార పరీక్షలతో అనేక ఫలితాలు పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా భూసార పరీక్షల గురించి పలు సూచనలు చేశారు. కార్యకమంలో రైతులు, ఏఈవోలు పాల్గొన్నారు.

చందోలు హైవేపై గుర్తుతెలియని మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్

పిట్టలవానిపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామపంచాయతీ పరిధిలోని నేషనల్ హైవేపై బుధవారం రాయల్ మెరైన్, సంతబజార్ మధ్య గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్టు చందోలు ఎస్ఐ ఎం.వెంకటశివకుమార్ తెలిపారు. సుమారు 65 సంవత్సరాల వయసు గల వ్యక్తి వడదెబ్బ తగిలి మృతి చెందినట్లుగా ఉందని, ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఆయన తెలిపారు.

రజకుల కులవృత్తుల చెరువులను కాపాడాలి

బాపట్లరూరల్, జూ 4 (ఆంధ్రజ్యోతి) : అంతరించిపోతున్న రజకుల కులవృత్తుల చెరువులను కాపాడాలని బాపట్ల ప్యాడిసన్ పేటకు చెందిన మహిళలు బుధవారం తహసీల్దార్ సలీమాకు వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ ప్యాడిసన్ పేటలో ఉన్న చెరువు గత ప్రభుత్వంలో ఆక్రమణకు గురైందని, సదరు విషయాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించి ఆక్రమణలను తొలిగించి మరలా తిరిగి రజకులకు కేటాయించే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.రాజారావు, మాలమహానాడు అధికారప్రతినిధి శీలం రోజనబాబు పాల్గొన్నారు.

కొండలస్వామికి ఘన సత్కారం



కొండలుస్వామిని సన్మానిస్తున్న గుండ్రెడ్డి శివ తదితరులు

కర్లపాలెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కొండలు స్వామి పాడిన రఘుకుల తిలకా పాటను ప్రపంచ వ్యాప్తంగా సోషల్ మీడియాలో 40కోట్ల మంది వీక్షించటం హర్షణీయమని సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు, జీఎస్ఆర్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుండ్రెడ్డి శివ అన్నారు. బుధవారం రఘుకుల తిలకా పాట గాయకుడు కొండలుస్వామిని గుండ్రెడ్డి శివ శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పుప్పాల సాంబశివరావు, పంతం నాగేశ్వరరావు, ఈవూరి మణికంఠ, కెఆర్ఎం శ్రీనివాసరావు, త్రిపురం సంజీవరెడ్డి, కారుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు, గొడ్డలి పోటు పేటెంట్ జగన్మోహన్‌రెడ్డికే

● ఎమ్మెల్యే ఆనందబాబు



వేమూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వెన్నుపోటు, గొడ్డలిపోటు పేటెంట్ జగన్మోహన్‌రెడ్డికేనని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు విమర్శించారు. కూటమి పాలన ఏర్పడి ఏడాదైన సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు జగన్ ముఠా ధర్నా డ్రామాలు ఆడుతున్నారన్నారు. తొలి ఏడాదిలో కనీసం 10 శాతం హామీలు కూడా జగన్ అమలు పరచలేకపోయాడన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 70 శాతం పైగా హామీలను అమలు చేసిందన్నారు. ఎత్తుకుని పెంచిన బాబాయిని చంపిన హంతకులను, కిరాతకులను కాపాడుతూ రక్త సంబంధానికి వెన్నుపోటు పొడిచిన ఘనత కూడా ఆయనదేనన్నారు. ఆస్తి కోసం తల్లిని, చెల్లిని ఇంటి నుంచి గెంటేసి కుటుంబ వ్యవస్థకు వెన్నుపోటు పొడిచారన్నారు. విషపూరితమైన మద్యం పోసి పేదల ఆరోగ్యానికి వెన్నుపోటు పొడిచారన్నారు. అన్న క్యాంటీన్లు రద్దు చేసి, పేదలకు, కార్మికులకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టించి సామాజిక న్యాయానికి వెన్నుపోటు పొడిచారన్నారు. 94 కేంద్ర ప్రాయోజిత పథకాలలో 73 పథకాలను పునరుద్దరించడం జరిగిందన్నారు.

దేవాలయ పునర్నిర్మాణం సంతోషకరం

● నాగేశ్వరస్వామిని దర్శించుకున్న పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్



దేవస్థానంలో మొక్కలు నాటుతున్న రాష్ట్ర పంచాయితీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆనంద్

భట్టిప్రోలు (కొల్లూరు), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గొరికపూడి గ్రామంలో ఇటీవల పునర్నిర్మించిన నాగేశ్వర స్వామి దేవస్థానాన్ని బుధవారం అసిస్టెంట్ కమిషనర్ కామరాజుగడ్డ ఆనంద్ సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పూర్వీకులు నడయాడిన ఈ గ్రామంలో శివాలయం పునర్నిర్మాణం తెలుసుకుని తమ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారన్నారు. ఆలయ పునః నిర్మాణం తీరు, కల్పించిన వసతులు చాలా బాగున్నాయన్నారు. గ్రామాభివృద్ధికి శాఖాపరంగా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. నిర్మాణ దశలో ఆగిపోయిన ఆరోగ్య కేంద్రం, రైతు సేవా కేంద్రాలకు సంబంధించిన భవనాల గురించి అధికారులను ఫోన్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆయా భవనాలకు సంబంధించిన ప్రతిపాదనలు తనకు పంపాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రాంగణంలో ఉసిరి, మారేడు మొక్కలు నాటారు. గ్రామ సర్పంచ్ గరికపాటి మల్లిక వెంకటేశ్వరరావు, పులిగడ్డ భగవాన్, ఇక్కుర్తి సాంబశివరావు, ధూళిపాళ్ల అప్పారావు, యడ్ల సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి



ముగ్గులు వేసి హర్షం వ్యక్తం చేస్తున్న జనసేన నాయకులు

రేపల్లె, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్న తీరును చూసి తమ నిర్ణయం సరైనదేనని భావిస్తున్నారని జనసేన పార్టీ నాయకుడు పూషడపు నాని అన్నారు. రేపల్లె పట్టణంలో జనసేన పార్టీ రేపల్లె నియోజకవర్గ సమన్వయ కర్త మత్తి భాస్కరరావు ఆధ్వర్యంలో బుధవారం రోడ్లపై ముగ్గులు రంగులతో నింపి సంక్రాంతి పర్వదినాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కనీసం పంచాయతీలకు సర్పంచ్‌లకు ఒక్కరూపాయి నిధులు ఇవ్వని వైసీపీ ప్రభుత్వం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారం చేపట్టి సంవత్సరకాలంలోనే లక్షలాది కోట్ల రూపాయలతో ప్రతి గ్రామంలోను సీసీ రోడ్లు, త్రాగునీటి సౌకర్యం, కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చందోలు ప్రసాద్, యార్లగడ్డ చక్రవర్తి, ఆళ్ళ సూరిబాబు, బత్తులమల్లి, పేరంశెట్టి వాసు, హరిదాసు, రవితేజ, అంకిరెడ్డి ఉపేంద్ర, వీరేశ్వ ఉమా, బండా రాజా, వీరమహిళలు రాజ్యలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, అంకమ్మ, పూర్ణిమ, నాగలక్ష్మీ, సుహాసిని, రమణమ్మ, ఝాన్సీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో రాణిస్తే ఉద్యోగావకాశాల్లో రాయితీ



పతకాలను సాధించిన రేపల్లె తైక్వాండో క్రీడాకారులు

రేపల్లె, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : తైక్వాండో రంగంలో విద్యార్థులు రాణిస్తే శారీరక ధృడత్వం పెంపుదలతో పాటు మానసిక ఉల్లాసం పెంపొందించుకోవచ్చని జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ కె.జగన్‌మోహన్‌రావు అన్నారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రారంభమైన జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం ముగిశాయి. రేపల్లె కింగ్స్‌వే అకాడమికి చెందిన తైక్వాండో క్రీడాకారులు పలు విభాగాలలో గోల్డ్ మెడల్స్‌ను సాధించారు. సీహెచ్ జాస్విన్, సబ్ జూనియర్ సిహెచ్ వసుధ, ఎల్.హిరణ్మయి గోల్డ్ మెడలు సాధించారు. అదేవిధంగా అకాడమికిచెందిన మరో 20 మంది విద్యార్థులు వివిధ కేటగిరిలలో గోల్డు, రజితం, కాంస్య, తదితర మెడల్స్‌ను సాధించారని తెలిపారు. తైక్వాండో క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలలో రాయితీలు పొందవచ్చని ఆయన చెప్పారు. క్రీడాకారులను పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.

రైతుల ఆత్మహత్యలకు దేవదాయ శాఖాధికారులే కారణం

● జనతా పార్టీ అధ్యక్షుడు సాయిబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పేద రైతుల ఆత్మహత్యలకు దేవదాయ శాఖాధికారులే కారణమని జనతా పార్టీ అధ్యక్షుడు తాతా సాయిబాబు ఆరోపించారు. భట్టిప్రోలులో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, పేద రైతులు 50 సంవత్సరాలకు పూర్వం అర్చకుల నుంచి కొనుగోలు చేసిన భూమి 2016లో దేవదాయ శాఖ అధికారులు చుక్కల భూమిగా నమోదు చేయించి వారిని ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఇటీవల దేవదాయ శాఖ అధికారులు రైతులను బాపట్ల జిల్లా కార్యాలయానికి పిలిపించి మీరు ఎన్ని కోర్టుల్లో గెలిచిన ఆ భూమి మీకు చెల్లుబాటు కాదని చెప్పడం అభ్యంతరకరమన్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని వెల్లటూరుకి చెందిన లుక్కా వెంకటేశ్వరరావు, కాటూరి సాంబయ్య, గుడిపల్లి ఏడుకొండలు ఆత్మహత్యలకు పాల్పడటం జరిగిందన్నారు. దేవదాయ శాఖ రైతులను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదని, ఇప్పటికైనా పేద రైతులకు వారి భూములను కేటాయించాలని కోరారు.

రోడ్డుప్రమాదంలో ఛిద్రమైన మహిళ దేహం

చెరుకుపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లిలో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒక 50 సంవత్సరాల మహిళ మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం మతిస్థిమితం లేని ఆ మహిళ రోడ్లపై తిరుగుతుంటుందని తెలిపారు. మహిళను ఢీకొట్టిన వాహనం ఆమెను అర కిలోమీటర్ దూరం రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్ళడంతో రోడ్డు అంతా రక్తసిక్తమై మహిళ శరీరం పూర్తిగా ఛిద్రమై శరీర భాగాలు రోడ్డు మీద చెల్లాచెదురుగా పడిపోయాయి. పరిస్థితి బీతావహంగా ఉండటంతో పోలీసులు, పంచాయతీ సిబ్బందితో కలిసి ఆ శరీర భాగాలను అక్కడి నుండి తరలించి రోడ్డు క్లీన్ చేయించారు. తెల్లవారుజామున సుమారు నాలుగు గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ఎస్ఐ టి.అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.







మా"నస" సరోవరంలో... ఆహ్లాదం కను"మ(ము)రుగు"

అది గుంటూరు నగరంలో ఉన్న ఒకే ఒక ఆహ్లాదకరమైన ప్రదేశం.... పచ్చని చెట్లు వాటి నడుమ పారే సెలయేరులో బోటింగ్ చేస్తూ.... పచ్చిక బయళ్ళలో చెట్లపై ఉన్న పక్షులను, జంతువులను చూస్తూ ఆహ్లాదకరంగా నగర ప్రజలు గడిపేందుకు వచ్చేవారు. ఇది నగర సమీపంలో ఉన్న ఒకప్పటి మానస సరోవరం పరిస్థితి. తాజాగా ఇక్కడ ఆహ్లాదం కనుమరుగై ఆ ప్రాంతమంతా మురుగునీటి గుంటల్ని తలపిస్తోంది. రెండున్నర దశాబ్దాల క్రితం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఈ ఉద్యానవనం ప్రస్తుతం అధ్వాన స్థితికి చేరింది.పచ్చిక బయలు స్థానంలో బురదమయంగా మారింది. గుంటూరు నగరం సమీపంలోని తక్కెళ్ళపాడు వద్ద ఉన్న మానస సరోవరం దుస్థితి.

-గుంటూరు (ఆంధ్రజ్యోతి)

వెంటాడుతున్న.. ప్లాస్టిక్ భూతం



- చర్యలు తీసుకోకుంటున్నా వదలని ప్లాస్టిక్
- మానవ శరీరాల్లోకి చొచ్చుకొస్తున్న సూక్ష్మ ప్లాస్టిక్ పదార్థాలు
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

గుంటూరు, బాపట్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మానవాళికే కాకుండా జంతుజాతులకు నేడు ప్లాస్టిక్ ముప్పుగా పరిణమించింది. ప్రపంచ వ్యాప్తంగా ఏ మూలకు వెళ్లినా ప్లాస్టిక్‌తో ఉత్పత్తి అయిన వస్తు వులే కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్ ఉత్పత్తులు పర్యావరణానికి సవాలు విసురుతున్నాయి. వీటిని సరైన పద్ధతిలో డిస్పోజ్ చేయడం లేదు. డస్టుబిన్‌లు, డ్రెయిన్లలో బాధ్యతారహితంగా పడేస్తున్నారు. డ్రెయిన్లలో వేసినవి వర్షాకాలం వరదనీటితో పాటు ప్రవహించి నదులు, సముద్రాల్లోకి చేరిపోతున్నాయి. డస్టుబిన్‌లలో వేసినవి జంతువుల కడుపులోకి చేరి వాటి ఆయువుని తీస్తున్నాయి. ప్లాస్టిక్ వలన తనకేమి కాదులే అన్న నిర్లక్ష్యం ప్రతీ ఒక్కరిలో గూడు కట్టుకుపోయింది. అయితే అ వి క్రమక్రమంగా ప్రజల శరీరాల్లోకి సూక్ష్మంగా చేరుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే కచ్చితంగా మన పర్యావరణం దెబ్బతినడం ఖాయం. ఈ ప్రమాదాన్ని దశాబ్ధాల క్రితమే గ్రహించిన యూ ఎన్‌వో ఏటా జూన్ 5వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా ఈ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నది. 2025 సంవత్సరానికి ప్లాసిక్ కాలుష్యాన్ని ఓడించు అన్న నినాదాన్ని ఇచ్చింది. ఇప్పటికే దీనిపై రైల్వేలో 15 రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ శాఖల ద్వారా అవగాహన తీసుకొచ్చేందుకు చేస్తోన్న ప్రయ త్నాలకు ప్రజలంతా సంఘీభావం ప్రకటించి ఆచరిస్తే కొంతలో కొంత మార్పు అయినా వస్తుంది.

జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ని కొన్ని సంవత్సరాల క్రితమే నిషేధించారు. అయితే వాటిపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. నగరపాలకసంస్థ, మునిసిపాలిటీలు అరకొరగా దాడులు నిర్వహించి రూ. 500 నుంచి రూ. 1500 వరకు పెనాల్టీ వేయడం తప్పా ఎవరైతే వాటిని వినియోగిస్తున్నారో వాళ్లలో మార్పు తీసుకురాలేక పోతున్నాయి. నేడు ఏ వ్యాపార దుకాణానికి వెళ్లి చూసినా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, స్ట్రాలు, టార్పాలిన్ పట్టాలు, స్పూన్‌లు, వాటర్, కూల్ డ్రింక్స్ పెట్ బాటిల్స్, గ్లాసులు, రైస్‌బ్యాగులు, ఆహార పదార్థాలు ప్యాక్ చేసే ప్లాస్టిక్ డబ్బాలు, పాలప్యాకెట్లు వంటివి కనిపిస్తూనే ఉన్నాయి. వీటిని వినియోగదారులు ఒకసారి వాడటం మరుసటి రోజున డస్టుబిన్/కాలువలో పడేయడం చేస్తున్నారు. రీయూజబుల్ వస్తువులను మొక్కుబడిగా వినియోగించడం మినహా ఎప్పుడో వాటికి మంగళం పాడేశారు. స్టీలు, గ్లాసు వంటి పాత్రలను వినియోగించడం లేదు. గతంలో వేసవి వచ్చిందంటే ఊరగాయ పచ్చళ్లు పింగాణితో తయారు చేసిన జాడీల్లో పెట్టేవారు. నేడు వీటిని కూడా ప్లాస్టిక్ బక్కెట్‌లు ఆక్రమించేశాయి.

స్థానికంగానూ ఇక్కడ ప్లాస్టిక్ వస్తువుల తయారీ ఫ్యాక్టరీలుండగా, ఎక్కువగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో తయారైన ఉత్పత్తులు నిత్యం టన్నుల కొద్దీ దిగుమతి అవుతున్నాయి. వీటిని నియంత్రించే పరిస్థితి జిల్లాలో ఏ కోశాన కనిపించడం లేదు. పెనాల్టీలతో సరిపెడుతుండటం వలన వినియోగదారుల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా జూట్‌బ్యాగులు, స్టీలు, గాజు పాత్రల వినియోగాన్ని ప్రోత్సహించడం లేదు. ఒకదశలో అధికార యంత్రాంగం గట్టిగా చర్యలు తీసుకోవడంతో చాలామంది ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా క్లాత్‌బ్యాగులు వినియోగించారు. అనతికాలంలోనే అది అటకెక్కి మళ్లీ యథాతథ స్థితికి చేరుకున్నది. సూక్ష్మ ప్లాస్టిక్ పదార్థాలు మానవుల శరీ రాల్లోకి ప్రవేశిస్తున్నాయని వైద్యులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నా మార్పు రావడం లేదు.

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనేది ఒకటి ప్రతీ జిల్లాలోనూ ఉన్నది. అయితే దీనికి ఒక ఈఈ స్థాయి అధికారి, కొద్ది మంది సిబ్బంది మాత్రమే ఉంటారు. వీళ్ల ప్రపంచ పర్యావరణ దినోత్సవానికి ఒక వారం ముందు ఎంతో ఘనంగా కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరింప చేస్తారు. జూన్ 5వ తేదీన ఒక ర్యాలీ, సమావేశం నిర్వహించి మమ అనిపిస్తారు. అంతకుమించి ఆ తర్వాత ఎలాంటి చర్యలు తీసుకోరు. ప్రజల్లో మార్పు తీసుకురావడానికి నిరంతరం చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఏ ఒక్కరూ ఆలోచన చేయడం లేదు. అవగాహన కార్యక్రమాలు నిత్యం జరిగి ప్లాస్టిక్ వినియోగాన్ని కట్టడి చేసే చర్యలు కొనసాగితేనే కొంతలో కొంత మార్పు వస్తుంది. లేదంటే ప్లాస్టిక్ దెబ్బకు పర్యావరణం కుప్ప కూలిపోయే పరిస్థితి ఎంతో దూరంలో లేదన్నది ప్రతీ ఒక్కరూ గ్రహించాలి.



బాపట్ల మండలం ముత్తాయపాలెంలో రోడ్డు పక్కనే డంప్ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలతో కూడిన చెత్తాచెదారం

ప్రమాదంలో పర్యావరణం

ప్లాస్టిక్ కాలుష్యం గ్రహసంక్షోభంగా మారింది. మైక్రోప్లాస్టిక్‌లు మహాసముద్రాలు, పర్వతశిఖరాలు, మానవ దేహాల్లోనూ కనిపిస్తున్నాయి. నానాటికి పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్నది. రుతువులు గతితప్పుతున్నాయి. అడవులు అంతరించిపోతున్నాయి. భూగర్భజలాలు తగ్గిపోతున్నాయి. నదులు, సముద్రాలు కలుషితమౌతున్నాయి. ఈవిధంగా జరిగితే మానవ మనుగుడ ప్రమాదపుటంచులో పడుతుంది. అడవుల్లో చెట్లను విచ్చల విడిగా నరికివేయడంతో పచ్చనిచెట్లు ఎండిపోతున్నాయి. తీరంలోని మడ అడవులు అంతరించిపోయాయి. అదేవిధంగా తీరంలో విస్తరించిన చెట్లు సైతం సంరక్షణ లేక ఎండిపోతున్నాయి. బాపట్ల మండలం సూర్యలంక తీరంలో అటవీప్రాంతం నానాటికి అంతరిస్తున్నది. దీనివల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటున్నది. ఇదేవిధంగా కొనసాగితే భవిష్యత్తులో మానవజీవితం ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉంది.



బాపట్ల మండలం సూర్యలంక తీరంలోని అటవీప్రాంతంలో ఎండిపోతున్న మోడులతో ఉన్న చెట్లు

నేడు రాజధానిలో... వనమహోత్సవం

- హాజరుకానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- అనంతవరం పార్కులో ఒకే సారి రెండు వేల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు



సిద్ధం అయిన వేదిక



అనంతవరం పార్కులో నాటేందుకు లారీలో నుంచి దించుతున్న మొక్కలు

తుళ్లూరు, (అనంతవరం) జూన్ 4, (ఆంధ్ర జ్యోతి) రాజధాని అమరావతి నగరాన్ని బ్లూ అండ్ గ్రీన్ సిటీగా తీర్చిదిద్దటమే ధ్యేయంగా పెట్టుకున్న సీఎం చంద్రబాబు నాయుడు గతం లో కూడా రాజధానిలో పెద్ద ఎత్తున వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క మొక్క నాటింది లేదు. తిరిగి అమరావతికి పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా కూటమి ప్రభుత్వం వడివడిగా అడుగు లు వేస్తుంది. రాజధాని గ్రామం అనంతవరం రెవెన్యూలో గత టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన 20 ఎకరాల పార్కులో గురువారం ప్రపంచ పర్యావరణ దినత్సవాన్ని పురస్కరించుకొని సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొంటారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లను అధికారులు 36 గంటల్లో పూర్తి చేయటం విశేషం. ఒకేసారి రెండు వేల మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేశారు. సభా వేదిక పనులు పూర్తి చేశారు. రైతులు, రైతు కూలీలు, మహిళలు సీఎం కార్యక్రమానికి భారీగా హాజరవుతారని అధికారులు చెపుతున్నారు. భారీ ఎత్తున పోలీసు బలగాలు సభా వేదిక వద్దకు చేరుకున్నాయి. కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నారు. వేదిక దక్షిణం వైపు పబ్లిక్ పార్కింగ్ కోసం చదును చేశారు. వర్షం పడినా ఇబ్బందులు లేకుండా కార్యక్రమం సజావుగా జరిగేందుకు ఏర్పాటు చేస్తున్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, పురపాలక శాఖ మంత్రి నారాయణ, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ తేజ, సీఎం చీఫ్ సెక్యూరిటీ అధికారి, ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఏడీసీ, సీఆర్డీఏ, రెవెన్యూ అధికారులు ఏర్పాట్లను సమీక్షించారు. సభకు వచ్చే వారికి మంచి నీరు, అల్పాహారం అందించే ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు సీఎం, డిప్యూటీ సీఎం వేదిక వద్దకు వస్తారు. మొక్కలు నాటిన అనంతరం వేదిక నుంచి ప్రసంగిస్తారు. 12.30 గంటల కల్లా కార్యక్రమం ముగుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో జిల్లా లిఫ్టర్ల సత్తా

మంగళగిరి సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా ఒంగోలు పట్ట ణంలో ఈ నెల రెండో తేదీ వరకు మూడు రోజులపాటు జరిగిన ఏపీ స్టేట్ సబ్‌జూనియర్స్, జూని యర్స్, సీనియర్స్ మాస్టర్స్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్, బెంచిప్రెస్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన పవర్ లిఫ్టర్లు సత్తా చాటారు. ఈ వివరాలను జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని బుధవారం వెల్లడించారు. ఆయా విభాగాల్లో వ్యక్తిగత పతకాలతోపాటు సబ్ జూనియర్స్‌లో బాలికల టీం చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం, బాలుర టీం చాంపి యన్‌షిప్‌లో తృతీయ స్థానం, జూనియర్స్ మహిళల టీం చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం, జూనియర్స్ పురుషుల టీం చాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానం, సీనియర్స్ మహిళల టీం చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం, సీనియర్స్ పురుషుల టీం చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం, ఓవరాల్ టీం చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం సాధిం చారని తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసి యేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సకల కోటేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటా వెంకటేశ్వరరావు, సకల సూర్యనారాయణ, జిల్లా వైస్‌చైర్మన్ ఆర్ఎస్ వంశీకృష్ణ, కోశాధి కారి గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.



పతకాలు సాధించిన లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

ఇసుక రీచ్‌ల మూతతో.. ఇక్కట్లు

- ఉపాధి కోల్పోయిన కార్మికులు
- శిథిలావస్థలో ఇసుక పడవలు
- ఆరేళ్లుగా పనుల్లేక ఇబ్బందులు
- కూటమి పనులు కల్పిస్తుందని ఎదురుచూపు

అచ్చంపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఇసుక కార్మికులు ఉపాధి కోల్పోయి ఆరు సంవత్సరాలు కావస్తుంది. లక్షల రూపాయల విలువ చేసే ఇసుక పడవలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలోని కస్తల, కోనూరు, అంబడిపూడి, చామర్రు తదితర ప్రాం తాల్లో ఇసుక విరివిగా లభ్యమవుతుంది. ఇసుక రీచ్‌లు కూడా ఉన్నాయి. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మండలంలోని కార్మికులకు, దూర ప్రాంతాల నుంచి ఉపాధికి వచ్చే కార్మికులకు పనులు లేక ఉపాధి కోల్పోయారు. వైసీపీ ప్రభుత్వంలో మూతపడిన ఇసుక పడవలు ఒడ్డుకు చేరి శిథిలావస్థకు చేరుకున్నాయి. కస్తల కృష్ణానది ఒడ్డున సుమారు వందకు పైగా ఇసుక పడవలు ఉన్నాయి. ఇవే కాక చుట్టు పక్కల రేవుల్లో నుంచి ఇసుక పడవలు వస్తుంటాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ రేవులో మూడు వందలకు పైగా ఇసుక పడవలు ఉన్నాయి. ఒక్కో పడవకు 15 మంది కార్మికులు, క్రేన్ దగ్గర పని వారు, లారీల వద్ద పని చేసే వారు సుమారు ఒక్క కస్తల రేవులోనే నాలుగు వేల మందికి పైగా నిత్యం పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారు. అలాంటిది వైసీపీ ప్రభుత్వం రావటంతో పడవలకు పనుల్లేక ఇసుక కార్మికులు జీవనోపాధి కోల్పోయారు. ఒడ్డుకు చేరిన ఒక్కో పడవ ఖరీదు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుంది. అలాంటి పడవలు నేడు శిథిలావస్థకు చేరి మరమ్మతులకు లోనయ్యాయి.

ఉపాధి కోల్పోయిన ఇసుక కార్మికులకు కూటమి పనులు కల్పిస్తుందని పడవల యజ మానులు, ఇసుక కార్మికులు ఎదురు చూస్తున్నారు. పెదకూరపాడు, సత్తెనపల్లి, బెల్లం కొండ, క్రోసూరు, అచ్చంపేట మండలాల వారే కాక కృష్ణా జిల్లా నుంచి కూడా వచ్చి ఇక్కడ పనులు చేసుకునేవారు. నిత్యం వేలాది మంది కార్మికులకు ఉపాధి కలుగ చేసిన ఇసుక రేవు నేడు వెలవెల బోతుంది.


కస్తల గ్రామ కృష్ణానది ఒడ్డున నిలిచి ఉన్న ఇసుక పడవలు





శిథిలావస్థలో ఉన్న పడవను బాగు చేసుకుంటున్న యజమాని

పనులు కల్పించండి



కస్తల ఇసుక రేవులో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వందలాది మందికి పని దొరి కేది. పడవలకు పనులు దొరకటం వల్ల అనేక మంది కార్మికులు ఉపాధి పొందేవారు. 20 సంవత్సరాల నుంచి ఇసుక పని చేస్తున్నాను పది లక్షలు వెచ్చించి ఇసుక పడవ కొనుగోలు చేశాను. ఆరు సంవత్సరాలుగా ఇసుక పని లేక ఇబ్బందులు పడుతున్నాను. పనులు కల్పించండి.

సయ్యద్ మహబూబ్ సుభాని, పడవ యజమాని

ఎండకు ఎండి మరమ్మతులు



పనులు లేక ఒడ్డున ఉంచటం వల్ల లక్షల ఖరీదు చేసే పడవలు ఎండకు ఎండి మరమ్మతులకు వచ్చాయి. సుమారు రెండు లక్షలు ఖర్చవుతుంది. కూటమి ప్రభుత్వం ఇసుక పనులు కల్పిస్తుందని ఆశిస్తున్నాను.

ముమ్మసాని ఏడుకొండలు, తాడువాయి, యజమాని

సోలార్ ప్రాజెక్టు భూముల పరిశీలన

దొనకొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): దొనకొండలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం ఎంపిక చేసిన ప్రభుత్వ భూములకు చెందిన పూర్తి వివరాలను ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ జిల్లా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. వెంకటకృష్ణారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ దొనకొండలో దాదాపు ఐదు వేల ఎకరాల భూముల్లో 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందు కోసం ఎంపిక చేసిన రుద్రసముద్రం, మంగినపూడి, భూమనపల్లి గ్రామాల పరిధిలోని భూముల వివరాలను విచారించినట్లు తెలిపారు. ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన కరెంట్ ఇవ్వాలనే ధ్యేయంతో ఈ ప్రాంతంలో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రైతులతో రెవెన్యూ అధికారులు సంప్రదింపులు జరుపుతారని, అందరూ సహకరిస్తే త్వరలో ప్రాజెక్టు ఏర్పాటుకు అడుగులు ముందుకు పడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. శ్రావణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ నాగార్జునరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు.. చిక్కులు

(5వ పేజీ తరువాయి)

రావడాన్ని ఉద్యోగులు తప్పుబడుతున్నారు. సిబ్బంది కొరత మూడు జిల్లాల్లో ఉన్నప్పటికీ కొత్త జిల్లాలైన బాపట్ల, పల్నాడు జిల్లాలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంది. దీంతో రీ సర్వే ఆశించినంత వేగంగా సాగడం లేదు. హద్దులు నిర్ణయించడానికి ఉపయోగించే రోవర్స్‌లో దాదాపు సగం సాంకేతిక సమస్యలతో పనిచేయడం లేదు. రోవర్స్‌ను బాపట్ల జిల్లాకు 119 కేటాయిస్తే 68 మాత్రమే పనిచేస్తున్నాయి. సాంకేతిక సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఉద్యోగుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే పని చేయని రోవర్స్ సంఖ్య వంద వరకు ఉండొచ్చని తెలుస్తోంది. రీ సర్వేలో సర్వే విభాగంతో పాటు రెవెన్యూ సిబ్బంది కూడా పాల్గొనాలి. అయితే రెవెన్యూలో అన్ని విభాగాల్లో కలిపి మూడు జిల్లాల పరిధిలో 320 వరకు ఖాళీలు ఉన్నట్లు సమాచారం. రీ సర్వే కార్యాలయాల్లోనూ ఖాళీలుండడం గమనార్హం. గత ప్రభుత్వం తప్పిదాలపై గ్రామసభల్లో వచ్చిన అర్జీల సంఖ్య ఒక్క బాపట్ల జిల్లాలోనే 5,900 వరకు ఉండగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య 14,000కు పైనే ఉంది. వీటి పరిష్కారం యంత్రాంగానికి తలకు మించిన భారంగా మారడంతో రీ సర్వేలో వేగం మందగించింది. రెండో దశ రీ సర్వే అంకాన్ని పూర్తి చేయడానికి ఈ నెల 6న గడువుగా ప్రభుత్వం విధించింది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితిని గమనిస్తే ఇప్పటి వరకు 30 శాతం కూడా రీ సర్వే పనులు పూర్తి కాలేదు. రెండో దశలో బాపట్ల జిల్లాలో 79,000 ఎకరాలకు ఇప్పటి వరకు కేవలం 26,000 ఎకరాల్లోనే పూర్తి చేశారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

అమరావతి కేంద్రంగా.. క్వాంటం వ్యాలీ

(5వ పేజీ తరువాయి)

కేటాయించగా దానిని బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఆమోదించారు. దీంతో త్వరలోనే క్వాంటం వ్యాలీ అమరావతిలో ఏర్పాటు కానుంది. క్వాంటం కంప్యూటింగ్ అనేది ఎంతో అడ్వాన్స్ టెక్నాలజీ. క్వాంటం కంప్యూటర్లు సంప్రదాయ కంప్యూటర్ల కంటే శక్తిమంతంగా గణన చేస్తాయి, కొత్త ఔషధాల అభివృద్ధి, నమూనా రూపొందించడంలో సహకరిస్తాయి. ప్రస్తుతం పరిశోధన, అభివృద్ధి దశలో ఉండగా భవిష్యత్తులో కీలకం కానుండటంతో దానిని అందిపుచ్చుకునేందుకు సీఎం చంద్రబాబు క్వాంటం వ్యాలీని అమరావతిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అమరావతిలో ఏర్పాటు చేయబోయే క్వాంటం వ్యాలీ అడ్వాన్స్ రీసెర్చ్ ఇన్ క్వాంటం కంప్యూటింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీలపై ఐఐటీ మద్రాసు, టీసీఎస్, ఐబీఎంతో కలిసి పని చేస్తుంది. తద్వారా అంతర్జాతీయ స్థాయి పరిశోధకులను అనువైన వేదికగా అమరావతి నిలుస్తుంది. అలానే దేశ, విదేశాల నుంచి పెట్టుబడులను ఆకర్షిస్తుంది. ఇప్పటికే క్వాంటం వ్యాలీకి సంబంధించిన డీపీఆర్‌ని రూపొందించి నివేదించారు. ఎల్అండ్‌టీ సంస్థ క్వాంటం వ్యాలీ టెక్ పార్కు అభివృద్ధి చేస్తుంది. ఈ నెలలో సదస్సుని అంతర్జాతీయ నిపుణులతో కలిసి నిర్వహించి అభివృద్ధి వ్యూహాత్మక ప్రణాళికలను సిద్ధం చేయనున్నారు.

ముగిసిన డీఆర్పీ శిక్షణ

ఒంగోలు విద్య, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని రామచంద్ర మిషన్‌లో గత మూడు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్(డీఆర్పీ) శిక్షణ బుధవారంతో ముగిసింది.

నల్లబర్లీ రైతులలో చిగురిస్తున్న ఆశలు

ప్రభుత్వ ఆదేశాలతో మార్క్‌ఫెడ్ అధికారుల్లో కదలిక

నాణ్యత కాపాడుకునేందుకు రైతుల పాట్లు

పంగులూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకు రైతులను ఆదుకునే దిశగా కూటమి ప్రభుత్వం చేపడుతున్న చర్యలు, మార్క్‌ఫెడ్ అధికారుల కదలికలతో బర్లీ రైతులలో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రైవేటు కంపెనీలతో పాలకవర్గ నేతలు పలు దఫాలు జరిపిన చర్చలు ఆచరణలో ఆశించిన ఫలితాలివ్వక పోవడంతో నల్లబర్లీ రైతులు నిరాశకులోనయ్యారు. మంగళవారం మార్క్‌ఫెడ్ అధికారులు నల్లబర్లీ కొనుగోళ్ల కోసం గోడౌన్ల పరిశీలన చేయడం రైతుల్లో కొంత ఆత్మస్థైర్యం నింపింది. ప్రభుత్వం ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందితో రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు నిల్వలను సేకరించింది. కొనుగోళ్ల విషయంలో ప్రైవేట్ కంపెనీలు వ్యవహరిస్తున్న తీరును గుర్తించిన ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా వెలువడే కార్యాచరణ ప్రణాళిక కోసం ఎదురు చూస్తున్నారు.



పొగాకు మండెను తిరగేస్తున్న రైతులు

మండలంలో 47,108 క్వింటాళ్ల నిల్వలు

పంగులూరు మండలంలో 47,108 వేల క్వింటాళ్ల నల్లబర్లీ పొగాకు నిల్వ ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇందులో టాప్‌లీఫ్ 33 వేల 894 క్వింటాళ్లు కాగా, అడుగులు 13,214 వేల క్వింటాళ్లు నమోదైంది. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం త్వరితగతిన నల్లబర్లీ కొనుగోళ్లు చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలం

అద్దంకి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చినహనిమిరెడ్డి చెప్పారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బుధవారం అద్దంకిలో శింగరకొండ రోడ్డులోని వైసీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ భవానీసెంటర్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది. వైఎస్ రాజశేఖరరెడ్డి, పొట్టి శ్రీరాములు, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. అనంతరం తహసీల్దార్ శ్రీచరణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు జ్యోతి హనుమంతరావు, కాకాని రాధాకృష్ణమూర్తి, అడవి శ్రీనివాసరావు, పులికం కోటిరెడ్డి, కోయి అంకారావు, ఈదా శ్రీనివాసరెడ్డి, కొల్లా భువనేశ్వరి, నాగేశ్వరరావు, కృష్ణబాబు, రావూరి శ్రీను, పాలపర్తి శ్రీధర్ పాల్గొన్నారు.



పర్చూరులో ర్యాలీ చేపడుతున్న వైసీపీ నేతలు

పర్చూరులో వైసీపీ నిరసన ర్యాలీ

పర్చూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల హామీలను అమలు చేయటంలో ప్రభుత్వం విఫలమైందని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి గాదే మధుసూదన్‌రెడ్డి చెప్పారు. వైసీపీ నిరసన ర్యాలీ కార్యక్రమం చేట్టింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొల్లా వెంకట్రావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు భవనం శ్రీనివాసరెడ్డి, జువ్వా శ్రీనివాసరావు, ముప్పాళ్ల రాఘవయ్య, గాజుల రమేష్, జంగా అనిల్, యద్దనపూడి హరిప్రసాద్, కఠారి అప్పారావు, తోకల కృష్ణమోహన్, గేరా స్వరాజ్ పాల్గొన్నారు.

కూటమి మాటలు ఉత్త మూటలు

చీరాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం మాటలు గాలి మూటలని, ప్రజలను నట్టే ముంచారని పలువురు వైసీపీ నేతల విమర్శించారు. ఆ పార్టీ రాష్ట్ర వ్యాప్త ఆదేశాల పిలుపు మేరకు నియోజకవర్గ ఇంచార్జి కరణం వెంకటేష్ ఆదేశాలతో చీరాలలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు బొనిగల జైసన్‌బాబు, వాసు, కబీర్, రమణారెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మేదరమెట్లలో భారీ అగ్నిప్రమాదం

రూ.40లక్షల ఆస్తినష్టం

మేదరమెట్ల, జూన్ 4(సెప్టెంబరు): షార్ట్‌సర్క్యూట్‌తో భారీ అగ్నిప్రమాదం చోటుకుంది. మంగళవారం అర్ధరాత్రి మేదరమెట్ల సెంటర్‌లోని పుస్తకాలు, బ్యాగులు, ఫ్యాన్సీ వస్తువులు అమ్మే దుకాణంలో అగ్ని ప్రమాదం జరిగి మొత్తం కాలిపోయాయి. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నందున దుకాణ యజమాని పి. వాసు పెద్ద ఎత్తున పుస్తకాలు, బ్యాగులు, ఇతర వస్తువులు తెప్పించి నిల్వ చేశారు. ప్రతిరోజు అక్కడే నిద్రించే అతను మంగళవారం మాత్రం తాళం వేసి ఇంటికి వెళ్లారు. అయితే అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్ మంటలు రేగగా వాటిని చూసిన స్థానికులు వాసుకు సమాచారం అందించారు. అతను వెంటనే అద్దంకి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక శాఖ అధికారి వెంకట్రావు తన సిబ్బందితో వచ్చి నాలుగు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. చుట్టుపక్కల గృహాల వారు ఈ ప్రమాదంతో భయకంపితులయ్యారు. ఫైరింజన్ సకాలంలో రావడంతో ఊపరిపీల్చుకున్నారు. బుధవారం పగలంతా కూడా పొగలు వస్తూనే ఉన్నాయి. దీంతో స్థానికులు ట్రాక్టర్ ట్యాంకర్‌తో నీళ్లు తెప్పించి దుకాణంలో చల్లారు. ఈ ఘటనలో వాసు పెంపుడు కుక్కలు లోపలే ఉండగా అవి తెలివిగా బాత్రూంలో దాక్కోవడంతో ప్రమదం నుంచి బయటపడ్డాయి. అగ్నిమాపక సిబ్బంది తీవ్ర ప్రయత్నం చేసి వాటిని కాపాడారు. షాపులో దాదాపు రూ.40లక్షల విలువైన ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వాసు తెలిపారు.



మంటలు చెలరేగడంతో బాత్రూంలోకి వెళ్లిన ప్రాణాలను రక్షించుకున్న కుక్కలు



దుకాణంలో చెలరేగిన మంటలు

వైట్ క్వార్జ్ అక్రమ తవ్వకాలపై దాడి

ఎక్స్‌కవేటర్, టిప్పర్ స్వాధీనం

వెలికితీసిన తెల్లరాయి సీజ్

ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న అధికారులు

పీసీపల్లి, జూన్4 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా తెల్లరాయిని వెలికితీసి సొమ్ము చేసుకుంటున్న అక్రమ క్వారీయింగ్‌పై అధికారులు దాడి చేశారు. రెవెన్యూ, అటవీశాఖ, మైనింగ్ అధికారులు మంగళవారం రాత్రి సంయుక్తంగా దాడులు చేసి యంత్రాలతో పాటు వెలికితీసిన తెల్లరాయిని స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మురుగుమ్మి సమీపంలోని అనాధీన భూములతో పాటు అటవీ భూముల్లోకి కొంతమంది అక్రమంగా ప్రవేశించి ఎటువంటి అనుమతులు లేకుండా యంత్రాలతో తెల్లరాయిని వెలికితీస్తున్నారు. వెలికితీసిన రాయిని వాహనాల ద్వారా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే కొంతమంది వ్యక్తులు ఈ విషయాన్ని అటు మైనింగ్ ఇటు అటవీ, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు.దీంతో మైనింగ్ అధికారి విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో పోలిరెడ్డి తమ సిబ్బంది, రెవెన్యూ అధికారులతో కలిసి అక్రమ క్వారీయింగ్ జరుగుతున్న ప్రాంతానికి మంగళవారం రాత్రి వెళ్లారు. అక్కడ రాయిని వెలికితీస్తున్న ఎక్స్‌కవేటర్, టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే వెలికితీసి ఉన్న తెల్లరాయిని సీజ్ చేశారు. ఆ ప్రాంతంలో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్, టిప్పర్లతో అధికారులు

జగన్ చెప్పారు.. చేశామంతే!

నాయకులు తప్ప సామాన్యులు లేరు

పసలేని ప్రసంగాలతో తుస్

కందుకూరు, పర్చూరులో తోలారు

వైసీపీ వెన్నుపోటు దినం కార్యక్రమం స్పందన అంతంతే

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

విపక్ష వైసీపీ వివాదాస్పదమైన నినాదంతో చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొక్కుబడిగా సాగింది. జగన్ చెప్పారు చేయక తప్పదు కదా అన్న చందంగా కొన్ని ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించగా కొన్నిచోట్ల సర్వశక్తులొడ్డి కార్యక్రమం నిర్వహణ పర్వాలేదనిపించారు. ఆ పార్టీ నాయకుల్లో కదలిక కనిపించినా చాలామంది కార్యకర్తలు, అంతకు మించిన సామాన్య ప్రజలు వారి కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఉమ్మడి జిల్లా మొత్తంగా తీవ్రంగా ప్రయత్నించి కార్యకర్తలను సమీకరించటం ద్వారా కందుకూరు, పర్చూరులో జరిగిన కార్యక్రమాలు ముందు వరుసలో ఉండగా మిగిలిన చోట్ల సాదాసీదాగా కార్యక్రమాలు జరిగాయి. ఇక కూటమి పార్టీలు హడావుడిగా ఇచ్చిన పిలుపునకు అనుగుణంగా ఆ పార్టీశ్రేణులు నిర్వహించిన విజయోత్సవ సంబరాలు అంతంతమాత్రంగా సాగాయి.

రాష్ట్రంలో గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్ 4న వెల్లడైన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా వెన్నుపోటు దినం పేరుతో నియోజకవర్గాల వారీ కార్యక్రమాల నిర్వాహణకు వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో కూటమి పార్టీలు విజయం 4వతేదీ ఖరారైనా జూన్ 12న మాత్రమే ప్రభుత్వం అధికారాన్ని చేపట్టింది. దీంతో 12వతేదీకి తమ ప్రభుత్వానికి ఏడాది పూర్తవుతుందని అభివృద్ధి ఫలాల విజయోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని తెలుగుదేశం పార్టీ ఇప్పటికే ప్రకటించింది. అయితే జగన్ ఫలితాలు వచ్చిన రోజునే వెన్నుపోటు దినంగా ప్రకటించటంతో ఆ నినాదమే వివాదాస్పదంగా మారింది. అయినా నియోజకవర్గాల వారీ కార్యక్రమాన్ని భారీగా జయప్రదం చేయాలని వైసీపీ అధినేతలు జిల్లా, నియోజకవర్గాల నాయకులపై తీవ్రమైన వత్తిడి తెచ్చారు. వారంరోజుల నుంచి ఆ పార్టీ నాయకులంతా ఈ కార్యక్రమం విజయవంతం చేసే పనిలోనే నిమగ్నమయ్యారు. నాయకులను కదిలించటం, కార్యకర్తల వద్దకు వెళ్లటం, ప్రజలను సమీకరించేందుకు సర్వశక్తులొడ్డారు. అయితే ఎన్ని ప్రయత్నాలు చేసినా కార్యక్రమానికి సామాన్య ప్రజలు దూరంగా ఉండటం విశేషం. బుధవారం జరిగిన అన్ని కార్యక్రమాలను పరిశీలించగా ముఖ్యమైన నాయకులు వారి మాట కాదనలేని ద్వితీయశ్రేణి నాయకులు మాత్రమే కార్యక్రమాల్లో పాల్గొనటం కనిపించింది. సాధారణ కార్యకర్తలు కూడా కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. వైసీపీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు విశ్వప్రయత్నం చేసినా నాయకులు తప్పా సామాన్య కార్యకర్తలు కదలకపోవటం చర్చనీయాంశమైంది.

డబ్బు, వాహనాలతో సమీకరణ

జిల్లాలోని అన్నీ నియోజకవర్గాల్లో జరిగిన కార్యక్రమాలను పరిశీలిస్తే పర్చూరు, కందుకూరులో జరిగిన నిరసన కార్యక్రమాల్లో కాస్తంత ఎక్కువ సంఖ్యలో ఆ పార్టీశ్రేణులు పాల్గొన్న దాఖలాలు కనిపించాయి. పర్చూరులో 350 నుంచి 400 మంది వరకు నిరసన ర్యాలీలో పాల్గొనగా, కందుకూరులో 500మంది పాల్గొన్నారు. అయితే ఈ రెండుచోట్ల ఆ మాత్రం కార్యకర్తల సమీకరణకు బాగా కష్టపడ్డారు. వాహనాలు ఏర్పాటు చేయటం, భోజనాలు ఏర్పాటులాంటి అదనపు చర్యలు ఎక్కువగా కనిపించాయి. పర్చూరుకు కొత్తగా ఇన్‌చార్జి అయిన మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో ఏర్పాటు చేసుకున్నారు. కందుకూరు ఇన్‌చార్జి మధుసూదన్ యాదవ్ మాజీ మంత్రి మహీధర్‌రెడ్డి సహకరించకపోయినా తనకు పట్టుందని నిరూపించుకునేందుకు సామదాన దండోపాయాలు ఉపయోగించి కార్యకర్తలను సమీకరించారు. కనిగిరిలో ర్యాలీకి కార్యకర్తల సమీకరణకు డబ్బులు పంపిణీ చేయటం విశేషం. మిగిలిన అన్నీ ప్రాంతాలను పరిశీలిస్తే ఒకొక్క చోట కనీసం 70 మంది నుంచి 250 మందికిలోపే కార్యక్రమాల్లో ఆ పార్టీశ్రేణులు పాల్గొన్నట్లు వెల్లడైంది. అసలు ఈ కార్యక్రమం నిర్వహణ కరెక్టు కాదేమో.. నినాదం కూడా బాగా లేదేమో అన్న అనుమానాలను కార్యక్రమాల్లో పాల్గొన వైసీపీ శ్రేణులు వ్యక్తం చేయటం విశేషం.

హడావుడి కార్యక్రమం

కూటమి భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేనలు బుధవారం సాయంత్రం విజయోత్సవ కార్యక్రమాలకు పిలుపునిచ్చాయి. అది ఆఖరు క్షణంలో హడావుడిగా పిలుపునివ్వటం విశేషం. ఉమ్మడి జిల్లానే పరిశీలిస్తే హడావుడిగా పిలుపునివ్వటంతో అందుబాటులో లేక ఆ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఎక్కువచోట కార్యక్రమాల్లో పాల్గొనలేదు. నిర్వహించిన చోట స్థానికంగా ఉన్న కార్యకర్తలు బాణసంచాలుపేలవటంలాంటి మొక్కుబడి కార్యక్రమాలు నిర్వహించారు.

పచ్చిరొట్ట పంట సాగుతో భూసారం పెంపు



రైతులకు సూచనలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ముందుగా వర్షాలు పడుతున్నందున రైతులు పచ్చిరొట్ట పంటసాగు చేపట్టి భూసారం మరింత పెంచుకోవాలని, ఏవో సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని బూదవాడ, కోటపాడు, కల్లంవారిపాలేల్లో బుధవారం ఖరీఫ్ సన్నద్ధత కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రైతు భూసార పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలకు అనుగుణంగా పంటసాగులో ఎరువులు, పురుగు మందులు వినియోగం చేపట్టాలన్నారు. కౌలు రైతులు సాగుదారు హక్కు పత్రాలు పొందడం ద్వారా ప్రభుత్వం అందచేసే రాయితీలు పొందుతారని చెప్పారు. సమావేశాలలో వ్యవసాయ సహాయకులు అలెగ్జాండర్, అక్షరరాణి, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, గుదిబండ్ల చిన ఆదిరెడ్డి పాల్గొన్నారు.

విద్యతో పాటు చక్కని బుద్ధులు నేర్పండి

డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి

చీరాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : విద్యాభ్యాసానికి వచ్చే విద్యార్థులకు విద్యతో పాటు చక్కని బుద్ధులు నేర్పాలని డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి చెప్పారు. స్థానిక వీఆర్ఎస్ అండ్‌వైఆర్ఎన్ కళాశాలలో ఉపాధ్యాయులకు జరుగుతున్న మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని డిప్యూటీ కలెక్టర్ పరిశీలించారు. శిక్షణలో పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఏఎంవో డాక్టర్ మోజెస్ కోర్స్ డైరక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

కూటమి పండుగ

ప్రజా తీర్పుకి ఏడాది పూర్తి

సంబరాలు నిర్వహించిన టీడీపీ, జనసేన శ్రేణులు

పలుచోట్ల కేక్ కటింగ్‌లు

ఒంగోలు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి గెలిచి ఏడాది పూర్తయిన స ందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా టీడీపీ, జనసేన శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. పలుప్రాంతాల్లో కేక్ కటింగ్‌లు, బాణసంచా సంబరాలతోపాటు ముగ్గులు వేసి ఆనందం వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనకు చమరగీతం పాడుతూ ప్రజానీకం ఇచ్చిన తీర్పు గత ఏడాది జూన్ 4న వెల్లడైంది. జిల్లాలోనూ, రాష్ట్రంలోనూ టీడీపీ కూటమి అనూహ్య విజయాలు సాధించి అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. కాగా కూటమికి పట్టం కడుతూ ప్రజాతీర్పు వెల్లడైన బుధవారం నాటికి ఏడాది ముగియడంతో పెద్ద ఎత్తున ఆ పార్టీలు సంబరాలు చేసుకున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఈసందర్భంగా ఒక వైపు టీడీపీ శ్రేణులు, మరో వైపు జనసేన శ్రేణులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో బుధవారం ఉదయం కేక్ కటింగ్ నిర్వహించారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. స్థానిక మంగమూరురోడ్డులోని సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ నేతల సమక్షంలో బీఎన్ విజయకుమార్ కేక్ కటింగ్ చేశారు. స్థానిక ప్రగతి కాలనీలో జనసేన వీరమహిళలు ముగ్గులు వేసి సంబరాలు నిర్వహించగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ పాల్గొన్నారు. రాత్రి అద్దంకి బస్టాండు సెంటర్‌లో ఒంగోలు నియోజకవర్గ నాయకులు నిర్వహించిన సంబరాల్లో ఒంగోలు ఎంపీ మాగుంట, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, మేయర్ గంగాడ సుజాతలు పాల్గొన్నారు. పెద్దఎత్తున బాణసంచాను కాల్చి సంబరాలు నిర్వహించారు. మార్కాపురంలో టీడీపీ నేత కందుల రామిరెడ్డి నేతృత్వంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు నిర్వహించగా దర్శిలో ఇన్‌చార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. అలాగే కొమరోలులో గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, వైపాలెంలో అక్కడి టీడీపీ ఇన్‌చార్జీ ఎరిక్షన్‌బాబులు పాల్గొన్నారు. జిల్లాలోని పలు ఇతర ప్రాంతాల్లోనూ అక్కడి టీడీపీ, జనసేన శ్రేణులు సంబరాలు నిర్వహించారు.

జిల్లాలో 474 మందికి ఉద్యోగోన్నతులు

ఒంగోలు విద్య, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 474 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు స్కూలు అసిస్టెంట్లు, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతులు లభించనున్నాయి. కొత్తగా పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు 105 మంజూరు కావడంతో ఎస్‌జీటీలకు పీఎస్‌హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతుల అవకాశాలు మరింత పెరిగాయి. జిల్లాలో మిగులుగా తేలిన 509మంది స్కూలు అసిస్టెంట్లను పీఎస్‌హెచ్‌ఎంలుగా నియమించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ మేరకు ఉత్తర్వులు కూడా జారీచేసింది. వీరిలో 404 మంది స్కూలు అసిస్టెంట్లను మాత్రమే హెచ్‌ఎంలుగా నియమించారు. మిగిలిన 105 పోస్టులను ప్రస్తుతం ఎస్‌జీటీలకు ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీచే స్తున్నారు. మొత్తం 474 ఉద్యోగోన్నతుల్లో జిల్లా పరిషత్ యాజమాన్యంలోని హైస్కూళ్లు, యూపీ స్కూళ్లు, ఆదర్శ ప్రాథమిక పాఠశాలల్లో 312మందికి, ప్రభుత్వ యజమాన్యంలోని పాఠశాలల్లో 98 మందికి, మునిసిపాల్టీల పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న 37మందికి, ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 27మందికి ఉద్యోగోన్నతులు లభించనున్నాయి. మొత్తం ఉద్యోగోన్నతుల్లో 172 పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు, 67 ఫిజికల్ డైరెక్టర్లు, స్కూలు అసిస్టెంట్లు తెలుగు 25, ఉర్దూ రెండు, హిందీ 29, ఇంగ్లీషు 22, గణితం(తెలుగు) 44, గణితం(ఉర్దూ) 2, ఫిజికల్ సైన్స్ (తెలుగు)16, పీఎస్(ఉర్దూ) 4, బయాలాజికల్ సైన్స్(తెలుగు)40, బీఎస్(ఉర్దూ) 3, సోషల్ (తెలుగు) 38, ఎస్ఎస్(ఉర్దూ) 1, స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు 8 ప్రస్తుతం ఉద్యోగోన్నతులు ద్వారా భర్తీచేస్తున్నారు.

సర్టిఫికెట్ల పరిశీలన

స్కూలు అసిస్టెంట్లు, పీఎస్ హెచ్‌ఎం పోస్టులకు అర్హులైన సెకండరీ గ్రేడ్ టీచర్ల సర్టిఫికెట్ల పరిశీలన బుధవారం స్థానిక డీఆర్ఆర్ఎం హైస్కూలులో నిర్వహించారు. ఒక్కొక్క పోస్టుకు ముగ్గురు చొప్పున 474 పోస్టులకు 1,422మంది ఎస్‌జీటీల సర్టిఫికెట్లు పరిశీలించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రత్యేక టీమ్‌లు సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. ఎస్‌జీటీల సర్వీసు రిజిస్టర్లు, విద్యార్హతల ఒరిజనల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. సర్టిఫికెట్ల పరిశీలనను డీఈవో కిరణ్‌కుమార్ పర్యవేక్షించారు.

ఆలయ భూముల కౌలు వేలం

ఒంగోలు(రూరల్), జూన్4(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలులోని శ్రీచెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామివారి దేవాలయ భూములకు బుధవారం దేశదాయశాఖ అధికారులు కౌలు వేలం వేశారు. స్థానిక ఆలయంలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 385 ఎకరాలకు గాను 63ఎకరాలకు మాత్రమే వేలం జరిగింది. వాటిని రూ.7.24లక్షలకు పాటదారులు పాడుకున్నారు. ఈ భూములు కొణిజేడు, సర్వేరెడ్డిపాలెం గ్రామాల పరిధిలో ఉన్నాయి. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, ఈవో సునీల్‌కుమార్, దేవదాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

రేపు అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మార్టూరు, జూన్4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వలపర్ల గ్రామంలో శుక్రవారం శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ వాయు ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామంలో అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని భక్తులు ఊరేగించారు. అదేవిధంగా శుక్రవారం పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు.

7 నుంచి అంకమ్మ తల్లి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మార్టూరు, జూన్4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్రోణాదుల గ్రామంలో ఈ నెల 7వ తేదీ నుంచి అంకమ్మతల్లి శక్తి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు సంబంధించి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. 7 నుంచి 10వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారని, 10వ తేదీ సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. భారీగా అన్నప్రసాద వితరణ చేస్తామన్నారు.

నేడు మండలంలో మంత్రి గొట్టిపాటి పర్యటన

పంగులూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ గురువారం మండలంలో పర్యటించనున్నారు. 5వ తేదీ ఉదయం 10 గంటలకు కొండమూరు, 10.45 నిమిషాలకు చందలూరు, 11.30 నిమిషాలకు కొరిశపాడు మండలం రావినూతల, మధ్యాహ్నం 12 గంటలకు మేదరమిట్ల ఎస్.బి. కన్వెన్షన్ హాల్, 12.30 నిమిషాలకు తమ్మవరం, మధ్యాహ్నం ఒంటి గంటకు బొడ్డువానిపాలెంలో మంత్రి గొట్టిపాటి పర్యటిస్తారని క్యాంప్ కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

శింగరకొండ వద్ద గోశాలకు స్థలం

అద్దంకి, జూన్4(ఆంధ్రజ్యోతి): హరిహర గోకులానికి శింగరకొండ వద్ద స్థలం కేటాయింపునకు చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో గోశాలకు అవసరమైన స్థలాన్ని పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. శింగరకొండ వద్ద శ్రీరామజీ వన సంఘం అన్నదాన సత్రం పక్కన ఉన్న స్థలం గోశాలకు అనువుగా ఉంటుందని గుర్తించామన్నారు.

చంద్రబాబు ఏడాది పాలనలో అభివృద్ధిలో ముందడుగు

● ఎంపీ మగుంట

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్లకాలంలో నిర్వీర్యమైన రాష్ట్ర అభివృద్ధిని గాడిలో పెట్టేందుకు ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు భారీ మెజార్టీని ప్రజానీకం ఇచ్చారని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడటంతో పాటు ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. బుధవారం ఒంగోలులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎంపీ మాగుంట మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడటం ద్వారా రాష్ట్రంలో ఏకపక్షంగా ఫలితాలు వచ్చాయన్నారు. అందులో భాగంగానే జిల్లాలో కూడా టీడీపీ భారీ విజయం సాధించిందని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకొని పోతుందన్నారు. ఇదే స్ఫూర్తితో ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గాన్ని టీడీపీకి కంచుకోటగా చేసుకునేందుకు కూడా అవకాశం ఏర్పడిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టుతో పాటు జిల్లాకు అనేక పరిశ్రమల ద్వారా అభివృద్ధి చెందేందుకు దోహదపడుతుందన్నారు. టీడీపీని మరింత బలోపేతం చేసే దిశగా తనవంతు కృషి చేస్తానని మాగుంట తెలిపారు.

స్వచ్ఛమైన పర్యావరణంతో భవిష్యత్తు తరాలకు మేలు

నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం

పర్యావరణ పరిరక్షణకు ప్రోత్సాహకాలు అందిస్తున్న ప్రభుత్వం

చీరాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛమైన పర్యావరణంతోనే భవిష్యత్తు తరాల మనుగడ ఆధారపడి ఉంది. అంతేగాక పాటు జంతువులు, పక్షులు తదితరాల జీవవైవిధ్యం సైతం పర్యావరణ రక్షణతోనే ముడిపడి ఉంది. ఒక్క మాటలో చెప్పాలంటే పర్యావరణ పరిరక్షణ ప్రజల ఉనికికే అతి ముఖ్యమైనది. అందమైన సూర్యోదయం, సెలయేటి పరవళ్లు, ఆహ్లాదకరమైన పూల తోటలు, జంతువులు, పశుపక్ష్యాదులు ఇవన్నీ కూడా మనతోపాటే సహజీవనం సాగించినప్పుడే జీవనం సుందరంగా, ఆనందంగా ఉంటుంది. అలా జరగాలంటే అందరికీ స్వచ్ఛమైన వాతావరణం అందించాలి. ఈ తరహా నినాదం ప్రజల్లో నిలిస్తేనే అందరికీ ఆరోగ్యం.

కాలుష్యం కోరల్లో ప్రాంతాలు

ప్రకృతిదైనందిన జీవితంలో భాగమైనప్పుడే మానవుడు ఆరోగ్యంగా జీవిస్తాడు. ప్రస్తుత పరిస్థితులు అందుకు అతి భిన్నంగా సాగుతున్నాయి. పెరిగిన జనాభా, వాహన రద్దీతో ధ్వని కాలుష్యం, వాయుకాలుష్యం, నీటి కాలుష్యం వంటి సమస్యలు తాండవం చేస్తున్నాయి. ఈ కాలుష్యంతో ప్రమాదం పొంచి ఉండటంతో పాటు, ప్లాస్టిక్ మహమ్మారి తోడవడంతో ప్రజలతో పాటు, మూగ జీవాలు సైతం ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి.



పేరాల ఏఆర్ఎం ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి, సంరక్షిస్తున్న టీచర్లు, విద్యార్థులు(ఫైల్)

ప్లాస్టిక్ నియంత్రణకు జోరుగా ప్రచారాలు

దేశమంతా ప్లాస్టిక్‌ను నియంత్రించాలని, 2022 నుంచే సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై విస్తృతంగా ప్రచారాలు చేశారు. ఆ క్రమంలోనే 2022 జూలై 1న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల తయారీతో పాటు, ఎగుమతులు, దిగుమతులు నిలిపివేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు కూడా వెలువడ్డాయి. దీంతో వస్త్రసంచులు పంపిణీలతో పాటు ప్రోత్సాహకాలు అందించడంతో కొంతమేరకు కదలిక వచ్చింది. కాలక్రమేణా అవి ప్రచారాలకే పరిమితమయ్యాయి.

పర్యావరణ పరిరక్షణకు ప్రోత్సాహకాలు

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమర్థ చర్యలతో తిరిగి పర్యావరణ పరిరక్షణకు బాటలు పడుతున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలతోపాటు మొక్కలు నాటి వాటిని పరిరక్షించే విధంగా చర్యలు చేపట్టింది. అలాగే పాఠశాలల్లో సైతం బాలబాలికలకు పర్యావరణంపై మక్కువ పెంచుతూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొంత ప్రజల్లో కూడా ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది రోజులకే పరిమితం కాకుండా నిత్యకృత్యంగా మారినప్పుడే ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుంది.

పాలిథిన్ ప్రమాదమని గుర్తించాలి

పవని భానుచంద్రమూర్తి, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్



పవన్ నుంచి అవార్డు అందుకుంటున్న భానుచంద్రమూర్తి

ప్రజలు ప్లాస్టిక్ వాడకంపై అవగాహన ఉండాలి. ఉదాహరణకు ప్లాస్టిక్ కుర్చీలు ఇంట్లో ఎన్నైనా ఉండవచ్చు. వాటిని ఒకదానిపై ఒకటి సర్దుకోవచ్చు. అలా కాదనకుంటే ఒక ఇంట్లో కనీసం ఐదు చెక్క కుర్చీలు ఉండాలంటే ఎన్ని చెట్లు నరకాలో గుర్తెరగాలి. ప్రతి ఒక్కరికీ పాల ప్యాకెట్ కావాలంటే సంబంధిత ఫ్యాక్టరీ నుంచి దుకాణాలకు ఎలా వస్తుంది ? కొనుగోలుదారులు ప్యాకెట్‌ను ఇంటికి ఎలా తెస్తారు ? వీటన్నింటిపై ముందు అవగాహన పొందాలి. కొనుగోలు చేసిన ప్లాస్టిక్‌ను వినియోగం అనంతరం చెత్త సేకరణ ప్రాంతానికి చేరేలా దృష్టి సారించాలి. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే ఇవన్నీ సాధ్యం. ఈక్రమంలో నిర్వహించిన రీసెర్చ్‌లలోనే ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డును సాధించగలిగాను.

తెలుగు యువత ఆధ్వర్యంలో సంబరాలు



అద్దంకిలోని బంగ్లా రోడ్డులో టపాసులు పేల్చుతున్న తెలుగు యువత



పర్చూరులో టపాసులు పేల్చుతున్న టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు

అద్దంకి, జూన్4 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం రాత్రి తెలుగుయువత ఆధ్వర్యంలో టపాసులు,బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. తెలుగుయువత నేతలు దామా సురేంద్ర, చిరుమామిళ్ల మాధవరావు తదితరుల ఆధ్వర్యంలో స్థానిక బంగ్లా రోడ్డులో పెద్ద ఎత్తున టపాసులు, బాణసంచా కాల్చారు. టీడీపీ నేతలు నరసింహ, కోటి, కపిల్, జనసేన నేత గోరంట్ల సాయి పాల్గొన్నారు.

పర్చూరులో మూడు పార్టీల ఆధ్వర్యంలో...

పర్చూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్ సైకో పాలన పడిపోయి ప్రజా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలం పూర్తిచేసుకున్న నేపథ్యంలో అందకారం నుంచి రాష్ట్రం విముక్తి అయిన రోజుగా బుధవారం పీడ విరగడై ఏడాది అనే కార్యక్రమంపై జనసేన పిలుపు మేరకు కూటమి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. పర్చూరు బొమ్మల సెంటర్‌లో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. తొలుత ఎన్టీఆర్, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, వంగవీటి మోహన్‌రంగా విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరాలలో విజయ సంబరాలు

చీరాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి అధికారం చేపట్టి ఏడాది కావడంతో నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం విజయ సంబరాలు జరిగాయి. ఎమ్మెల్యే కొండయ్య ఆదేశాల మేరకు కూటమి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రానికి పీడ విరగడయి యేడాది జరిగిందని అన్నారు. రాష్ట్రంలో కూటమి అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, కౌన్సిలర్ మించాల సాంబశివరావు, నాయకులు నాసిక వీరభద్రయ్య, గంజి పురుషోత్తం, శివరామప్రసాద్, పద్మిని పాల్గొన్నారు.



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కూటమి నాయకులు, కార్యకర్తలు

తైక్వాండో విద్యార్థులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్‌లు అందజేత

చినగంజాం, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : చినగంజాం తైక్వాండో క్లబ్ ఆధ్వర్యంలో వివిధ కేటగిరీలలో బెల్ట్ ప్రమోషన్ నిర్వహించినట్లు తైక్వాండో కోచ్ వాటుపల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తైక్వాండో జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్‌సలాం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. బ్లాక్ బెల్ట్ టెస్ట్‌లో కే గిరిజారెడ్డి ప్రమోట్ అయినట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు. ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు వివిధ కేటగిరీ బట్టి బెల్ట్ ప్రమోషన్‌ల సర్టిఫికెట్‌లను కొత్తపాలెం సర్పంచ్ ఆసోది బ్రహ్మారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు, వై.రామాంజనేయులు, కడవకుదురు గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ ఎం.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



బెల్ట్‌లు, సర్టిఫికెట్‌లను అందజేస్తున్న తైక్వాండో అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు

జనాభా నిర్వహణపై అభిప్రాయ సేకరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో స్వరూపారాణి, అధికారులు

పంగులూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం జనాభా నిర్వహణ విధానంపై క్యూఆర్ కోడ్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిందని, ఇందులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో కె.స్వరూపారాణి కోరారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అభిప్రాయ సేకరణ కోసం క్యూ ఆర్ కోడ్‌తో కూడిన బ్రోచర్‌ను అధికారులు, పంచాయితీ కార్యదర్శులతో కలసి ఆవిష్కరించారు. ఈ నెల 1 నుంచి 20వ తేదీలోపు క్యూ ఆర్ కోడ్‌లో ప్రభుత్వం పొందుపరిచిన విషయాలపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, కార్యదర్శులు రాంబాబు, సునీత, శ్రీనివాసరావు, జానీ బేగం, మాధవి, చరణ్ పాల్గొన్నారు.

గోవధకు పాల్పడితే కఠిన చర్యలు

చీరాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని వ్యవసాయాధారిత గోవధకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు హెచ్చరించారు. బుధవారం ఆయన కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి వీటిపై ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. వ్యవసాయాధారిత జీవులను వధించడంపై దృష్టిసారించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీఎండీ మొయిన్, సీఐ సుబ్బారావు, మునిసిపల్ డీఈ రఘురామ్ హాజరయ్యారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కారంచేడు - పర్చూరు రోడ్డులో ఘటన

కారంచేడు/పర్చూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం కారంచేడు అంబేద్కర్ కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన వేముల శివయ్య(57) మృతి చెందాడు. కూరగాయల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న శివయ్య చీరాల నుంచి తన స్వగ్రామం నూతలపాడు ద్విచక్రవాహనంపై వెళుతూ వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. క్షతగాత్రుడ్ని 108 వాహనం ద్వారా చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా ఆయన మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై కారంచేడు పోలీసుల కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, కుమార్తె కుమారుడు ఉన్నారు.



వేముల శివయ్య మృతదేహం

బీమా పథకంలో ప్రతి ఒక్కరూ పేరు నమోదు చేయించుకోవాలి

అవీఇవీ



భీమా నగదు చెక్కును అందజేస్తున్న చీఫ్ మేనేజర్ శీనానాయక్

బల్లికురవ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న భీమా పథకాలలో ఖాతాదారులు నమోదు కావాలని బల్లికురవ ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు చీఫ్ మేనేజర్ కె. శీనానాయక్ కోరారు. మండలంలోని కొండాయపాలేనికి చెందిన తన్నీరు శ్రీను అనే వ్యవసాయ కూలీ ఇటీవల ఉపాధి పనులు చేస్తూ అస్వస్థతకు గురై మృతి చెందాడు. అతను బల్లికురవ ఏపీజీబీ బ్యాంకులో ప్రధానమంత్రి జీవన జ్యోతి భీమా పథకంలో నమోదు చేసుకుని ఉన్నారు. దీంతో భీమా ద్వారా మంజూరైన రూ. 2 లక్షల నగదు చెక్కును బుధవారం చీఫ్ మేనేజర్ శీనానాయక్ మృతుడి భార్య శాంతకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సీహెచ్ రవీంద్రబాబు, అసిస్టెంట్ మేనేజర్లు సుహితా గ్రేస్, బిందుమాధవి పాల్గొన్నారు.

పాఠశాలల్లో నాణ్యమైన బియ్యంతో భోజనం



ఆహారాన్ని రుచి చుస్తున్న ఎంఈవో రమేష్

బల్లికురవ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన సన్న బియ్యంతో విద్యార్థులకు శుచిరుచిగా భోజనం అందజేస్తామని ఎంఈవో రమేష్ చెప్పారు. బుధవారం బల్లికురవ ఎంఆర్‌సీ కార్యాలయంలో మండలంలోని 58 పాఠశాలలకు చెందిన కుకింగ్ సిబ్బందికి శిక్షణ జరిగింది. శిక్షకురాలు వంట తయారు చేసే విధానంపై పలు సూచనలు చేశారు. ఎంఈవో రమేష్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు వంట తయారు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన వంట తయారీదారులు చేసిన భోజనాన్ని ఎంఈవో తిని వారికి పలు సూచనలు చేశారు.

ఘనంగా లక్ష్మీఅంకమ్మతల్లి దేవాలయ వార్షికోత్సవం



అలంకరణలో లక్ష్మీఅంకమ్మ తల్లి

బల్లికురవ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినఅంబడిపూడి గ్రామంలో ఉన్న లక్ష్మీఅంకమ్మ తల్లి దేవాలయ 27వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంకమ్మ తల్లిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు పూజలలో పాల్గొన్నారు. గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

ఖరీఫ్‌లో సాగుకు సమాయత్తం

రైతులతో అధికారులు అవగాహన కార్యక్రమాలు



మాట్లాడుతున్న వ్యవసాయ మండల అధికారి సుమతి

చీరాల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయాధికారులు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు రైతులను సన్నద్ధం చేస్తున్నారు. చీరాల మండల పరిధిలో ఏవో సుమతి ఆధ్వర్యంలో విజయనగర్ కాలనీ, బోయినవారిపాలెం ప్రాంతాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే వేటపాలెం మండల పరిధిలో ఏవో కాశీవిశ్వనాథ్ ఆధ్వర్యంలో దేశాయిపేటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ వారంలోనే పంట కాలువలకు ఎత్తిపోతల నుంచి సాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు. ఆయా పంటల విధివిధానాలపై రైతులతో చర్చించి పలు సూచనలు చేశారు.

యోగాంధ్రలో సత్తాచాటిన చిన్నారులు

ప్రథమ స్థానంలో నిలిచిన మనస్వి



చిన్నారులచే నిర్వహిస్తున్న యోగా పోటీలు

పర్చూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంఈవో కార్యాలయ ప్రాంగణంలో మండల స్థాయిలో బుధవారం నిర్వహించిన యోగాంధ్ర పోటీల్లో చిన్నారులు సత్తాచాటారు. ప్రథమ స్థానంలో ఆరో తగరతి విద్యార్థిని కొమ్మాలపాటి మనస్వి ప్రథమ స్థానంలో నిలిచారు. అదేవిధంగా కన్నా వేదనిఖిత ద్వితీయస్థానం, కోటా కార్తీక తృతీయస్థానం కైవసం చేసుకున్నారు. మండల స్థాయి విజేతలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశామని యోగా పర్యవేక్షకులు, హోమియో వైద్యులు దాసరి చంద్రశేఖర్ చెప్పారు. పోటీలను ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, ఈవోఆర్డీ కొసనా సత్యనారాయణ, యోగా శిక్షకులు కఠారి సత్యనారాయణ, కొసనా వెంకటేశ్వర్లు, యార్లగడ్డ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌రావులు పర్యవేక్షించారు.

వెంకటాపురంలో ఆలయ భూముల పరిశీలన

అద్దంకి, జూన్4(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురంలో దేవాలయ భూములలో ఉన్న చెట్లు నరికి వేశారని ఫిర్యాదు అందటంతో అద్దంకి గ్రూపు దేవస్థానాల ఈవో శైలేంద్రకుమార్ బుధవారం పరిశీలించారు. అయితే చెట్లు నరికిన భూమి డొంక భూమిగా రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారని ఈవో తెలిపారు. పూర్తి స్థాయిలో సర్వే చేయించి హద్దు రాళ్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.